

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ శారద

వీరు మారరంతే..!

- పేలవంగా జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం
- ప్రేక్షకపాత్రలో జడ్పీ చైర్‌పర్సన్
- దుమ్మా కొట్టిన 33 మంది జడ్పీటీసీ సభ్యులు
- ప్రతి స్థాయి సంఘ సమావేశానికి ఇద్దరుముగ్గురే హాజరు

కడప రూరల్ జనవరి 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ సారధ్యంలోని జడ్పీ పాలకమండలి స్టాండింగ్ కమిటీ సమావేశాలను గాలికి వదిలేసింది. ప్రజాసమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి దిశ నిర్దేశం చేయాల్సిన జడ్పీటీసీ సభ్యులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. మూడున్నర సంవత్సరాల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధికశాతం మంది ఏకగ్రీవంగా జడ్పీటీసీలయ్యారు. నాటి నుంచి స్టాండింగ్ కమిటీ సమావేశాలతో పాటు జడ్పీ సర్వసభ్య సమావేశాలను మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం జడ్పీ చైర్‌పర్సన్ జె.శారద అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని ఎప్పటిలాగా పేలవంగా నిర్వహించారు. ఉమ్మడి కడప జిల్లాలో మొత్తం 48 మంది జడ్పీటీసీ సభ్యులు ఉండగా 16 మంది, ఇద్దరు కో-ఆప్షన్ సభ్యులుండగా ఒక్కరు మాత్రమే హాజరయ్యారు. మొత్తం 50 మందికి గాను 33 మంది దుమ్మాకొట్టారు. మహిళా సంక్షేమస్థాయి సంఘంలో ఆరుగురు జడ్పీటీసీలు, 1 కో-ఆప్షన్ సభ్యుడు ఉండగా వీరిలో ఒక్కరు మాత్రమే హాజరయ్యారు. కోరం లేకపోయినప్పటికీ ఈ సమావేశాన్ని ఒక్కరితోనే కొనసాగించారు. మిగిలిన 6 స్థాయి సంఘ సమావేశాలకు కూడా ఇద్దరు, ముగ్గురు జడ్పీటీసీ సభ్యులు మాత్రమే హాజరయ్యారు.

మొక్కుబడిగా ఒకేసారి..

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలను ఒక్కొక్కటి కాకుండా మూడు, నాలుగు సంఘాలను కలిపి ఒకేసారి మొక్కుబడిగా నిర్వహించారు. ఒక్కొక్క స్థాయి సంఘానికి 6 నుంచి 8 మంది జడ్పీటీసీలతో పాటు 7 నుంచి 17 వరకు ప్రభుత్వ శాఖలు ఉన్నాయి. ఈ మేరకు విడివిడిగా ఒక్కొక్క స్థాయి సంఘంతో సమావేశం నిర్వహించి వాటి పరిధిలోని శాఖలపై చర్చించి ప్రజాసమస్యలకు పరిష్కారం చూపాలి. కానీ మూడు నాలుగు సమావేశాలను కలిపి ఒకేసారి నిర్వహించి అర్థవంతమైన చర్చ లేకుండా ముగించేశారు. జడ్పీ చైర్‌పర్సన్ జె.శారద అధ్యక్షతన 5 స్థాయి సంఘాలు ఉండగా ఏ ఒక్క సంఘ సమావేశంలోను ఆమె ప్రజాసమస్యలపై ఒక్కమాట కూడా మాట్లాడకుండా ప్రేక్షకపాత్ర వహించారు. దీంతో జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ అంతా తానై సమావేశాలను కొనసాగించారు.

సమస్యలపై అరకొరగా చర్చ

జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలలో ప్రజాసమస్యలపై అరకొరగా చర్చసాగించారు. చక్రాయపేట జడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బంది కొరత వేధిస్తోందన్నారు. కో-ఆప్షన్ సభ్యుడు కరీముల్లా మాట్లాడుతూ సుంకేసులలో రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టాలన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా శ్మశాన వాటికల్లో ముళ్లపొదల తొలగింపునకు అవకాశం కల్పించాలన్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ హెచ్‌ఎంపీవీ గురించి భయపడాల్సిన అవసరం లేదన్నారు. కొవిడ్ అంత ప్రాణాంతకమైంది కాదని అయితే తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న పిల్లలకు, వృద్ధులకు వైరస్ సోకే అవకాశం ఉందని, ఇప్పటివరకు మరణాలు లేవన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ఖాదర్‌వల్లి మాట్లాడుతూ జలజీవన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి కుళాయిని ఏర్పాటుచేసి నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. వేంపల్లె జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ వేంపల్లె నుంచి రాయచోటి రోడ్డు విస్తరణకు కష్టపడి భూసేకరణ చేశామని అయితే రోడ్డును నిర్మించకపోవడం బాధాకరన్నారు. పోరుమామిళ్ల జడ్పీటీసీ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో రోడ్లు సరిగా లేవన్నారు. పింఛన్లు తొలగిస్తున్నారని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. కాశినాయన మండలం, బద్వేలు మండల జడ్పీటీసీలు మాట్లాడుతూ తమ గ్రామాలలో పీఆర్ రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు.

రహదారులకు మహర్దశ

- రూ.1,456 కోట్లతో విస్తరణ పనులు
- వర్చువల్‌గా వైజాగ్ నుంచి ప్రధాని మోదీ శంకుస్థాపన

(కడప-ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ హయాంలో అభివృద్ధి పడకేసింది. ముఖ్యంగా గ్రామీణ, ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారులు అధ్వాన్నంగా తయారయ్యాయి. గోతుల రోడ్లతో ప్రజలు నరకం చూశారు. అయితే ఎన్‌డీఏ సర్కారు రాకతో మళ్లీ మంచి రోజులు వచ్చాయి. పంచాయతీరాజ్ ద్వారా గ్రామాల్లో సీసీ రోడ్లతో నూతకళ సంతరించుకుంటున్నాయి. ఇక దెబ్బతిన్న రోడ్లలో రాష్ట్ర ప్రభుత్వం గోతులు పూడ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఒకేసారి జిల్లా వ్యాప్తంగా ఆ పనులు ముమ్మరంగా సాగుతుండగా.. ఇక ప్రధాని మోదీ ఏకంగా రూ.1,456 కోట్లతో జిల్లాలో రహదారుల విస్తరణకు శంకుస్థాపన చేశారు. దీంతో రోడ్డు రూపురేఖలే మారిపోనున్నాయి. ఎన్నో ఏళ్లుగా గుంతలు పడ్డ రోడ్లతో నరకం అనుభవించిన ప్రయాణికులకు సాఫీ ప్రయాణం త్వరలోనే అందుబాటులోకి రానుంది. బుధవారం సాయంత్రం వైజాగ్‌లో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కలిసి రాష్ట్రంలో రూ.2.8లక్షల కోట్ల పనులకు ప్రారంభోత్సవంతో పాటు పలు అభివృద్ధి పనులను వర్చువల్‌గా ప్రారంభించారు. ఇందులో మన జిల్లాలో మైదుకూరు-పోరుమామిళ్ల రహదారి, వేంపల్లె-చాగలమర్రి రహదారుల విస్తరణ పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.



విస్తరణ కోసం వర్చువల్‌గా మోదీ శంకుస్థాపన చేసిన మైదుకూరు-ముదిరెడ్డిపల్లె రోడ్డు ఇదే..

వామ్మో ఆ రోడ్డా..!

మైదుకూరు నుంచి పోరుమామిళ్లకు వెళ్లే రహదారి అడుగుకు ఓ గుంతగా అధ్వాన్నంగా ఉండేది. ఇదే రహదారిపై కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, కదిరి ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు విజయవాడకు వెళుతుంటాయి. ఇక శ్రీశైలానికి కూడా ఇదే దారిలో వెళుతుంటాయి. ఇంతటి ముఖ్యమైన రహదారి అధ్వాన్నంగా గుంతలమయంగా తయారైంది. దీన్ని విస్తరించేందుకు మన జిల్లా నుంచి పొరుగున ఉన్న ప్రకాశం జిల్లాలోని సింగరాయకొండ వరకు ఆరు ప్యాకేజీలుగా విభజించారు. ప్రస్తుతం ఈ రోడ్డు 7 నుంచి 7.5 మీటర్ల వెడల్పు ఉంది. దీన్ని పది మీటర్లకు విస్తరించనున్నారు. జిల్లాలో మైదుకూరు నుంచి ముదిరెడ్డిపల్లె వరకు అక్కడ నుంచి పోరుమామిళ్ల వరకు రెండు ప్యాకేజీలుగా విభజించారు. ముదిరెడ్డిపల్లె సమీపంలో సుమారు 4 కిలోమీటర్ల మేర ఫారెస్టుల్యాండ్ ఉంది. ప్రస్తుతానికి 41 కిలోమీటర్ల మేర ఈ రోడ్డును 10.5 మీటర్లకు విస్తరిస్తున్నారు. రూ.135 కోట్ల వ్యయంతో చేపట్టనున్న 18 కి.మీ ఒక ప్యాకేజీ రోడ్డు విస్తరణకు బుధవారం ప్రధాని శంకుస్థాపన చేశారు.



రూ.1321 కోట్లతో విస్తరణకు నోచుకోనున్న రాయచోటి-వేంపల్లె-చాగలమర్రి రోడ్డు

ఇక రూ.1321 కోట్లతో

రాయచోటి-వేంపల్లె-చాగలమర్రి మధ్య రోడ్డు విస్తరణ పనులు చేడుతున్నారు. మొత్తం రూ.1321 కోట్ల అంచనా వ్యయం. రాయచోటి-వేంపల్లె మధ్య టెండరు పూర్తయింది. వేంపల్లె నుంచి చాగలమర్రి వరకు సుమారు 80 కి.మీ రహదారి విస్తరణ కోసం మోదీ శంకుస్థాపన చేశారు. ఇక ప్రొద్దుటూరు-ఎర్రగుంట్ల మధ్య నాలుగులేన్ల రహదారి విస్తరిస్తారు. 10.5 మీటర్లకు విస్తరించనున్నారు. ఇది పూర్తయితే ఈ ప్రాంతీయులకు రవాణా సదుపాయం భారీగా మెరుగుపడనుంది. దీంతో ట్రాఫిక్ సమస్యలు తొలగనున్నాయి. ఇప్పటికే బెంగళూరు-విజయవాడ ఆరు వరుసల రహదారి పనులు సాగుతున్నాయి. అలాగే కడప-ఎర్రగుంట్ల రహదారి పనులు మంజూరయ్యాయి. ఇక మైదుకూరు పోరుమామిళ్ల మీదుగా విజయవాడ వెళ్లే ప్రకాశం, గుంటూరు, క్రిష్ణాజిల్లాలను కలిపే రహదారుల విస్తరణ పనులు జరగనున్నాయి. అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో ఎన్‌డీఏ సర్కారు ఉండడంతో డబుల్ ఇంజను సర్కారుతో జిల్లా రోడ్లకు మళ్లీ మంచి రోజులు వచ్చినట్లయింది.

ఈ డీఈఓ మాకొద్దు

- ఆమరణ నిరాహార దీక్షలకు సిద్ధం
- ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా

కడప ఎడ్యుకేషన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను దుర్భాషలాడుతూ గౌరవం లేకుండా మాట్లాడుతున్న ఈ డీఈఓ తమకు వద్దని, తాము ఆమరణ నిరాహార దీక్షలకు కూడా సిద్ధమని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. బుధవారం కడప ఉపాధ్యాయ భవన్‌లో ఐక్యవేదిక సంఘాల నాయకులు సమావేశం నిర్వహించి ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. 9 నుంచి 19వ తేదీ వరకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి మంత్రి సవిత, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కడప జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలిసి వినతిపత్రాలు ఇవ్వనున్నారు. 23, 24 తేదీల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలపున్నారు. 27 నుంచి 31 వరకు డీఈఓ కార్యాలయ ముట్టడికి సన్నద్ధత, ఫిబ్రవరి 1న డీఈఓ కార్యాలయం ముట్టడి చేయనున్నారు. 3, 4 తేదీలలో మహాత్మాగాంధీ, డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించనున్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే 5 నుంచి 14వ తేదీ వరకు రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నారు. 19న మాస్ క్యాజువల్ లీవ్, 20 నుంచి 28వ తేదీ వరకు ఆమరణ నిరాహార దీక్షలకు సన్నద్ధత, మార్చి 1వ తేదీ నుంచి ఆమరణ నిరాహార దీక్షలకు దిగనున్నారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవం కోసం ఉద్యమ కార్యాచరణ జరిపి తీరుతామని అన్నారు. ప్రతి ఆదివారం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక సమావేశం ఉంటుందని, అందులో ఉద్యమ తీరుతెన్నులను పునఃసమీక్షించుకుని ఈ డీఈఓ జిల్లా వదిలి పెట్టేంత వరకు ఉద్యమ కార్యాచరణ కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మోపూరి వెంకటశివారెడ్డి, గుజ్జల తిరుపాల్, ఇలియాస్ బాషా, లెక్కల జమాల్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, అబ్దుల్లా, నరసింహరావు, రామాంజనేయులు, రాధాకృష్ణమూర్తి, రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాల్సిందే

- హెచ్చరించిన పాఠశాల విద్య జేడీ
- సెహరా సుల్తానా, ఆర్జేడీ శామ్యూల్



ప్రిన్సిపాళ్లకు సూచనలు ఇస్తున్న జేడీ సెహరా సుల్తానా, ఆర్జేడీ శామ్యూల్

ఖాజీపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మోడల్ స్కూళ్లు, కాలేజీల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని లేదంటే ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులదే బాధ్యత అని పాఠశాల విద్య జేడీ సెహరా సుల్తానా, ఆర్జేడీ శామ్యూల్ అన్నారు. బుధవారం రాయలసీమలోని 93 మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్‌కు ఖాజీపేట మోడల్ స్కూలులో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన జేడీ, ఆర్జేడీ మాట్లాడుతూ రాయలసీమలో 12 స్కూళ్లు ఉత్తీర్ణత శాతంలో వెనుకంజలో ఉన్నాయన్నారు. ఈ ఏడాది వందశాతం ఉత్తీర్ణత తీసుకురావాలని ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు కలిసి సి-గ్రేడ్, డి-గ్రేడ్ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో చర్చించాలని అన్నారు. పిల్లలను ఇంటి వద్ద చదివించేలా వారి తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. పిల్లల భవిష్యత్తు మీ చేతుల్లో ఉందని, రెండు నెలలు కష్టపడితే 100 శాతం ఉత్తీర్ణత సాధించవచ్చన్నారు. మరోమారు ఫిబ్రవరిలో రివ్యూ సమావేశం ఉంటుందని, అప్పటికి పిల్లలందరు ఏ, బీ గ్రేడ్‌లలో ఉండేలా చైతన్యం తేవాలన్నారు. కార్యక్రమంలో ఖాజీపేట మండల మోడల్ స్కూలు ప్రిన్సిపల్ విజయనరసింహ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దేహదారుఢ్య పరీక్షలు

- చివరి రోజు 312 మంది హాజరు



కానిస్టేబుల్ ఎంపికను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎస్పీ

కడప క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన ఉమ్మడి కడప జిల్లాకు సంబంధించిన అభ్యర్థులకు జిల్లా పోలీసుశిక్షణ కేంద్రంలో గత నెల 30 నుంచి నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలు ముగిశాయి. బుధవారం దేహదారుఢ్య పరీక్షల ప్రక్రియను ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షను పూర్తి చేసిన అభ్యర్థులకు ఫిజికల్ మెజర్‌మెంట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్టులకు ఉమ్మడి కడప జిల్లాలో మొత్తం 4,492 మంది అభ్యర్థులకు గాను 2,968 మంది హాజరు కాగా 1,681 మంది మెయిన్స్ పరీక్షకు అర్హత సాధించారన్నారు. చివరి రోజు 396 మంది అభ్యర్థులకు గాను 312 మంది హాజరయ్యారు. 167 మంది క్వాలిఫై అయ్యారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.రమణయ్య, డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు.

రిమ్స్‌లో ప్రత్యేక ఆస్తమా క్లినిక్

కడప సెవెన్ రోడ్స్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రిమ్స్‌లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పల్మనరీ మెడిసిన్ విభాగంలో బుధవారం ఆస్తమా క్లినిక్ ప్రారంభించామని పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ నూకరాజు తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, డాక్టర్ నూకరాజు మాట్లాడుతూ ప్రతినెలా రెండవ బుధవారం ప్రత్యేక ఆస్తమా క్లినిక్ సేవలు ఇక్కడ అందుబాటులో ఉంటాయన్నారు. వ్యాధి నిర్ధారణ, చికిత్స, నివారణ పద్ధతులు కచ్చితంగా పాటిస్తే ఆస్తమాను సులభంగా నియంత్రించవచ్చన్నారు. వ్యాధి నిర్ధారణ చేయకుండా మందులు వాడితే అనేక దుష్పరిణామాలు కలుగుతాయన్నారు. ఆస్తమా వ్యాధి కారకాలు ముఖ్యంగా వైరల్ ఇన్‌ఫెక్షన్లు, మందులు, ధూళి, దుమ్ము, చలి వాతావరణం, పెంపుడు జంతువులు, పుప్పొడి తదితరాలని అన్నారు. దగ్గు, ఆయాసం, ఛాతీలో బరువు, పిల్లికూతలు వంటి శబ్దాలు మొదలైనవి ముఖ్య లక్షణాలన్నారు. స్పెషలిస్ట్ పల్మనాలజీ వైద్య నిపుణులచే రోగిని పరీక్షించిన పిమ్మట వారికి తగిన పరికరాలు, మందులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాసులు, రాజేశ్వరి, సునీత, గీత తదితరులు పాల్గొన్నారు.



ఆస్తమా క్లినిక్ ప్రారంభం సందర్భంగా మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి

మోదీకి బ్రహ్మరథం



రోడ్‌షోలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అభివాదం



విశాఖపట్నంలో ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం



బహిరంగ సభ వేదికపై మోదీ అభివాదం. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారు.

భారీగా తరలివచ్చిన జనం

- రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం
- పూలవర్షం కురిపించిన అభిమానులు
- కేరింతలు, చప్పట్లతో మార్మోగిన ఏయూ ప్రాంగణం

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దత్‌ఐలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనంపైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరకు కాఫీని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.



వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్



బహిరంగ సభకు హాజరైన అశేష జనం

రూ.11.83 కోట్లతో ప్రతిపాదనలు

- కేంద్ర బృందానికి నివేదించిన కలెక్టర్ ● 19 మండలాల్లో దుర్భిక్షం



కేంద్ర బృందానికి కరువు పరిస్థితిని వివరిస్తున్న కలెక్టర్

మదనపల్లెటౌన్/ వాల్మీకిపురం/ తంబళ్లపల్లె/ కురబలకోట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో 30 మండలాలకు గాను 19 మండలాల్లో కరువు వలన దుర్భిక్షం ఏర్పడిందని, ఖరీఫ్‌లో పంట నష్టపరిహారానికి రూ.11.83 కోట్లు చెల్లించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ కేంద్ర కరువు పరిశీలన బృందానికి నివేదించారు. బుధవారం జిల్లాలోని బి.కొత్తకోట, తంబళ్లపల్లె, వాల్మీకిపురం మండలాల్లో పర్యటించిన కేంద్ర బృందం మధ్యాహ్నానికి మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఇక్కడ కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేంద్ర బృందం లీడర్ పెరిన్‌దేవి, సభ్యులు సుప్రియ మాలిక్, అనురాధ బటనా, ఆశిశ్‌పాండేలకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువగా ఖరీఫ్‌లో రైతులు 42 వేల హెక్టార్లలో వేరుశనగ పంట సాగు చేశారని వర్షాభావం వలన 60 శాతం పంట నష్టపోయారన్నారు. 10 వేల హెక్టర్లలో వరి పంట సాగు చేసినా చెరువుల్లో సరిపడా సాగునీరు లేక సరైన దిగుబడి రాలేదన్నారు. కేంద్రం పశుగ్రాసం సరఫరా చేస్తే పాడి రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా 19 మండలాల్లో తాగునీటి సమస్యలు రావడంతో ట్యాంకుల ద్వారా ప్రజలకు తాగునీరు సరఫరా చేశామన్నారు. కరువు వలన ఎంతో మంది రైతులు ఊర్లు విడిచి వలసలు వెళ్లారని, ఉపాధి హామీ పథకంలో వలసవెళ్లని ప్రజలను ఆదుకున్నామన్నారు. సమావేశంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, డీఏవో చంద్రానాయక్, ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి నివేదిస్తాం..

వాల్మీకిపురం మండలంలోని జర్రావారిపల్లెలో బుధవారం మధ్యాహ్నం కేంద్ర కరువు బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కరువు పరిస్థితులపై ఫొటో ప్రదర్శనను పరిశీలించి స్థానిక స్థితిగతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన ముఖాముఖిలో రైతులు పలు సమస్యలను కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేసి గ్రామానికి సాగు, తాగునీటి సరఫరా సౌకర్యాలు కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన కరువు బృందం అధికారులు పూర్తి సమగ్ర సమాచారాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సహాయక చర్యలు చేపట్టేలా చూస్తామని తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు తహసీల్దార్ పామిలేటి, ఇతర జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు, కూటమి పార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పంట నష్టపోయాం..ఆదుకోండి

కరువుతో పంటలు నష్టపోయాం.. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూసి తమను ఆదుకోవాలని కేంద్ర కరువు బృందం అధికారులకు రైతులు మొరపెట్టుకున్నారు. బుధవారం జిల్లా అధికారులతో కలిసి కేంద్ర కరువు బృందం అధికారులు తంబళ్లపల్లె మండలంలోని కోటకొండ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులతో ముఖాముఖి నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకుని పలు సలహాలు, సూచనలు చేశారు.నూనె గింజలు, టమోటా, వరి వంటి ఉత్పత్తులు రాయలసీమ ప్రాంతాల నుంచి దేశ స్థాయిలో సరఫరా అవుతున్నాయని అటువంటి ప్రాంతంలో 30 ఏళ్ల పాత రకాలైన కే6, నారాయణి, ధరణి వంటి వేరుశనగ విత్తన రకాలు పంపిణీ చేయడంపై అధికారులపై కేంద్ర బృందం అధికారి పెరిన్‌దేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు హరికుమార్, ఏవో రమణకుమార్, ఎస్ఐ లోకేష్ రెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు, రైతులు, ప్రజలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అన్ని విధాలా ఆదుకుంటాం

కరువు రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని కరువు బృంద అధికారి పెరిన్‌దేవి తెలిపారు. బుధవారం కురబలకోట మండలంలోని మట్లివారిపల్లెలో కేంద్ర కరువు బృందం పర్యటించి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో 'అన్నమయ్య' ప్రతిభ

- సౌత్ ఇండియాకు రెండు ప్రాజెక్టులు ఎంపిక



టీచర్స్ విభాగంలో శివనారాయణగౌడ్, విద్యార్థులు మహమ్మద్ సుహేల్, రెహాన్

రాయచోటి టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని మురళీ రిసార్ట్స్‌లో ఈనెల 7, 8 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో జిల్లా విద్యార్థులు ప్రదర్శించిన రెండు ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయని జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో జిల్లా నుంచి 6 ప్రాజెక్టులను ప్రదర్శించగా రెండు ప్రాజెక్టులు సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు ఎంపికయ్యాయని తెలిపారు. ఇందులో టీచర్స్ విభాగం నుంచి చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన శివ నారాయణగౌడ్ రూపొందించిన ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి కాపర్ కోటెడ్ బాటిల్ ప్రాజెక్టు, విద్యార్థుల గ్రూపులో కలకడ మోడల్ స్కూల్‌కు చెందిన మహమ్మద్ సుహేల్, రెహాన్‌లు రూపొందించిన బయో ఎంజైమ్స్ ప్రాజెక్టులు ఉన్నాయని తెలిపారు. గ్రూపు ప్రాజెక్టుకు సుమతి గైడ్ టీచర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరాజు, ఎన్‌సీఆర్‌టీ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డి, విశ్వేశ్వరయ్య యూనివర్శిటీ ప్రొఫెసర్ పురుషోత్తం వీరికి జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు పాండిచ్చేరిలో నిర్వహించే దక్షిణ భారతదేశ సైన్స్ ప్రదర్శనలో వీరు పాల్గొననున్నారని తెలిపారు. విజేతలతో పాటు గైడ్ టీచర్లను డీఈవో సుబ్రమణ్యం, ఉప విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బాలనాగేంద్ర, ప్రసాద్, ప్రిన్సిపాల్ మౌలామ్‌బాషావలి అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంతోనే రైతులకు లాభాలు

ఉద్యాన పంటలను పరిశీలించిన రాష్ట్ర హార్టికల్చర్ కమిషనర్ శ్రీనివాసులు



పీటీఎంలో జీవామృతం ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

పెద్దతిప్పసముద్రం/బి.కొత్తకోట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హార్టికల్చర్ కమిషనర్ కె.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని మడుమూరు గ్రామం వద్ద కొండా నరేంద్ర ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో 70 ఎకరాల్లో సాగు చేసిన అవకాడో, నేరేడు, అరటి, మామిడి, మునగ, నిమ్మ, ఉసిరి తదితర పంటలను పరిశీలించారు. అనంతరం మద్దయ్యగారిపల్లె సమీపంలో ప్రభుత్వం రూ.65 లక్షలతో ఏర్పాటు చేసిన ఎఫ్‌పీవో (ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) కేంద్రాన్ని పరిశీలించారు. పెద్దతిప్పసముద్రం రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం కేంద్రాన్ని ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం డ్రిప్ పరికరాల కోసం రూ.450 కోట్లు, ఉద్యాన పంటలకు మరో రూ.70 కోట్లు ఆయిల్‌పాం పంటల కోసం రూ.10 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఆయన వెంట డీఎంఐఏవో లక్ష్మీప్రసన్న, హార్టికల్చర్ అధికారి ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి, ములకలచెరువు హార్టికల్చర్ అధికారి భీమేష్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో...

జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీప్రసన్నతో కలిసి బుధవారం బి.కొత్తకోట మండలంలో హార్టికల్చర్ కమిషనర్ శ్రీనివాసులు పర్యటించారు. కోటావూరు గ్రామ సచివాలయంలో మదనపల్లె, తంబళ్లపల్లె ప్రాంతాల హార్టికల్చర్ ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మండలంలోని గుడిపల్లి పంచాయతీ పరిధిలో రైతు నగేష్ రూ.16 లక్షల రాయితీతో నిర్మించిన పాలీహౌస్‌లను సందర్శించి అందులో ఆధునిక పద్ధతిలో సాగు చేసిన రోజా పూల సాగును పరిశీలించి యాజమాన్య పద్ధతులు, మార్కెటింగ్‌పై రైతు నగేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ విలేఖర్లతో మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్రంలో 3 లక్షల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ చేపట్టబోతున్నామన్నారు. రూ.3978 కోట్ల బడ్జెట్‌తో హార్టికల్చర్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కమిషనర్‌ను ఏపీఎంఐపీ ఎంఐ ఇంజనీర్ల సంఘం ప్రతినిధి హరి కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు.

ముక్కోటి ఏకాదశికి రామాలయంలో ఏర్పాట్లు



రామాలయం వద్ద క్యూ లైనును సిద్ధం చేస్తున్న సిబ్బంది

ఒంటిమిట్ట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : కోదండరామాలయంలో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని భక్తుల కోసం ముమ్మర ఏర్పాట్లు చేపట్టారు. శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా రామాలయానికి పెద్దఎత్తున జిల్లా నలుమూలల నుంచి భక్తులు హాజరవుతారనే ఉద్దేశ్యంతో ముందుగా టీటీడీ అధికారులు రామాలయం చుట్టూ ప్రత్యేక క్యూలైను ఏర్పాటు చేశారు. అందుకోసం సిబ్బంది రామాలయం మాడవీధుల్లో ఎండవేడిని తట్టుకునేందుకు చలువ పందిళ్లతో పాటు క్యూలైన్లలో పైకప్పును ఏర్పాటు చేశారు. కోదండరామాలయ అభివృద్ధి పను లు జరుగుతున్నందున బాలాలయ పూజలు అందుకుంటున్న సీతారామ లక్ష్మణులు రామాలయం చుట్టూ చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. కోదండరామాలయంలో భక్తులను ఆకట్టుకునే విధంగా బెంగళూరు నుంచి తీసుకువచ్చిన పూలతో రామాలయంలోని ధ్వజస్తంభం, రంగమండపంలో ప్రత్యేక పూలంకరణ చేపట్టనున్నారు. వీటితో పాటు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులకు పులిహోర, చక్కర పొంగలిని ప్రత్యేకంగా తయారు చేసి భక్తులకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. టీడీపీ నాయకులు మేడా విజయశేఖర్‌రెడ్డి ముక్కోటికి 2 లక్షల రూపాయల నగదును పూల కోసం అందచేశారని నిర్వాహకులు ముమ్మడి నారాయణరెడ్డి, పసుపులేటి సుబ్బరాయుడులు తెలిపారు.

కూల్‌డ్రింక్ స్టాక్ పాయింట్‌లో పేలుడు



అగ్నిప్రమాదంలో కాలిపోయిన కూల్‌డ్రింక్స్ బాటిళ్లు, నెర్రెలు చీలిన గోడ

- రూ.40 లక్షలకు పైగా ఆస్తినష్టం

తంబళ్లపల్లె, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కూల్‌డ్రింక్స్ స్టాకు పాయింట్‌లో భారీ పేలుడు సంభవించడంతో కూల్‌డ్రింక్స్‌తో పాటు వస్తు సామాగ్రి కాలిపోయి, భవనం పూర్తిగా దెబ్బతిని సుమారు రూ.40 లక్షలకు పైగా నష్టం వాటిల్లిన ఘటన తంబళ్లపల్లెలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. తంబళ్లపల్లె మండలం పరుసతోపు పంచాయతీ చేలూరివాండ్లపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు పురుషోత్తం కూల్‌డ్రింక్స్‌కు డిస్ట్రిబ్యూటర్‌గా ఉన్నాడు. దీంతో ఓ నూతన భవనం నిర్మించుకుని అందులో కూల్‌డ్రింక్స్ స్టాకు పెట్టుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో స్టాకు పాయింట్ పక్కనే ఉన్న ఇంట్లో పురుషోత్తం నిద్రిస్తుండగా ఉన్నట్లుండి పెద్ద శబ్దంతో పేలుడు సంభవించి మంటలు చెలరేగాయి. దీంతో తేరుకున్న పురుషోత్తం, కుటుంబసభ్యులు స్టాకు ఉన్న భవనం వద్దకు వెళ్లి చూడగా మంటలు చెలరేగుతున్నాయి. దీంతో హుటాహుటిన పురుషోత్తంతో పాటు గ్రామస్తులు తీవ్రంగా కృషి చేసి మంటలను ఆర్పివేశారు. అప్పటికే అందులో స్టాకు ఉన్న సుమారు రూ.20 లక్షల విలువ చేసే కూల్‌డ్రింక్స్‌తో పాటు, వస్తు సామాగ్రి కాలిపోయి భవనం పూర్తిగా నెర్రెలు చీలి దెబ్బతింది. ఈ ప్రమాదంలో వస్తు, ఆస్థినష్టంతో కలిపి సుమారు రూ.40 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు యజమాని పురుషోత్తం తెలిపాడు. ప్రమాదానికి గల కారణం షార్ట్‌సర్క్యూటా.? లేక కూల్‌డ్రింక్స్‌లో ఉన్న గ్యాస్ లీకేజీ అయ్యి బాటిల్స్ పగలడంతోనా..? అన్నది తెలియాల్సి ఉంది. బుధవారం ఉదయం ఎస్ఐ లోకేష్ రెడ్డి, వీఆర్వో నాగరాజు, రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్ర మాదం జరిగిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, సిద్దమ్మ, కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రమాద స్థలాన్ని సందర్శించి విచా రం వ్యక్తం చేశారు. బాధితుడికి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై ప్రజాభిప్రాయ సేకరణ



వర్చువల్ సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజలు

మదనపల్లె టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపుపై ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేస్తోందని ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధర్ తెలిపారు. బుధవారం స్థానిక ఎస్పీడీసీఎల్ డివిజన్ కార్యాలయంలో ఏపీఈఆర్‌సీ (ఎలక్ట్రిక్ రెగ్యులేటరీ కమిషన్) ఆధ్వర్యంలో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్‌చార్జీల పెంపు అవసరంపై ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేస్తోందన్నారు. వీటిపై ప్రజల నుంచి అభ్యంతరాలు ఉంటే ఈఆర్‌సీ దృష్టికి తీసుకెళ్లవచ్చన్నారు. రాష్ట్రంలో ఎస్పీడీసీఎల్, ఈపీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్ వార్షిక ఆదాయం, బడ్జెట్ తదితర అంశాల ఆధారంగా ఈఆర్‌సీ ప్రజలు, పారిశ్రామికవేత్తల నుంచి అభిప్రాయాలు, అభ్యంతరాలు స్వీకరిస్తోందన్నారు. ఈనెల 7, 8 తేదీల్లో విజయవాడ నుంచి, 10వ తేదీ కర్నూల్ నుంచి వర్చువల్ సమావేశం నిర్వహిస్తారన్నారు. 10వ తేదీ నిర్వహించే సమావేశంలో పాల్గొనే ప్రజలు ముందస్తుగా పేర్లు నమోదు చేసుకుని వర్చువల్ సమావేశంలో వారి అభిప్రాయాలు తెలియజేయవచ్చని ఈఈ తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈలు గోవిందరెడ్డి, సురేంద్రనాయక్, హరికుమార్, ఏఈ ఉత్తన్న, అజయ్‌బాబు, ప్రజలు, ఎస్పీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

నకిలీ క్లయిమ్‌లతో రీఫండ్ చేస్తే చిక్కులు తప్పవు



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్

మదనపల్లె, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నకిలీ క్లయిమ్‌లు సృష్టించి ఆదాయపు పన్ను రీఫండ్ పొందితే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని ఆదాయపు పన్ను శాఖ తిరుపతి అడిషనల్ కమిషనర్ టి.వి.వంశీధర్ తెలిపారు. స్థానిక బేబీవెల్‌కమ్ హోమ్‌లో బుధవారం ఆదాయపు పన్ను చెల్లించే అసెసీలతో అవుట్ రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వంశీధర్ మాట్లాడుతూ ఇన్‌కంట్యాక్స్ అసెసీలు ప్రభుత్వానికి చెల్లించే ట్యాక్సును అడ్వాన్సుగా చెల్లిస్తే, సెక్షన్ 234బి, 234సీ సెక్షన్ ప్రకారం వడ్డీ ఉండదని తెలిపారు. ఇన్‌కం ట్యాక్సు నోటీసులు వచ్చే, వాటికి ఎలాంటి సమాధానం ఇవ్వాలి, అడ్వాన్సు ట్యాక్సు ప్రాముఖ్యత, ఏఐఎస్ పోర్టల్, వినియోగాన్ని వివరించారు. అలాగే స్థానిక ఆదాయపు పన్ను శాఖ అధికారి టి.మహ్మద్ ఫారూఖ్ మాట్లాడుతూ ఏఐఎస్ పోర్టల్ వినియోగం, ఫ్రాడులెంట్ రీఫండ్స్‌ను ఎలా అరికట్టాలో వివరించారు. వివాద్ సే విశ్వాస్-2024 పథకాన్ని గురించి ట్యాక్సు పేయర్స్‌కు అవగాహన కల్పించారు. అనంతరం ట్యాక్సు పేయర్స్ అడిగిన ప్రశ్నలు, వారు లేవనెత్తిన సందేహాలను వారు నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఇన్‌కంట్యాక్సు ఇన్‌స్పెక్టర్ సూర్యబాబునాయక్, ట్యాక్స్ బార్ అసోసియేషన్ సభ్యుడు ప్రసాద్, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు మదనపల్లె విద్యార్థి



లోహిత్

మదనపల్లె టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఝార్ఖండ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనేందుకు మదనపల్లెకు చెందిన లోహిత్ ఎంపికయ్యాడని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్‌పర్సన్లు అమృత, శ్రీదేవి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు ఏలూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న లోహిత్ 400 రిలే పరుగుపందెంలో ప్రథమ స్థానంలో నిలిచి సెలెక్టర్లను ఆకట్టుకున్నాడ టన్నారు. ఇందులో భాగంగా జాతీయస్థాయిలో ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించే అండర్-14 అథ్లెటిక్స్ పోటీలకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ షెహనాజ్‌ఖాన్, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, పీఈటీలు మహమ్మద్, భానుప్రకాష్‌లు లోహిత్‌ను అభినందించారు.

ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖలు ప్రగతి సాధించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మహిళా శిశు సంక్షేమం, ప్రజల ఆరోగ్య సంరక్షణ అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల్లో చిత్తశుద్ధితో ప్రగతి సాధించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్ నుంచి ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, అంగన్వాడీలు, వైద్య ఆరోగ్యశాఖ మెడికల్ అధికారులు, సిబ్బందితో ఆయా శాఖల అంశాల్లో సాధించిన ప్రగతి, సాధించాలిన ప్రగతి, ఏయే అంశాల్లో వెనుకబడి ఉన్నారు. అందుకు గల కారణాలు తదితరాల్లో కలెక్టర్ సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. ఐసీడీఎస్‌లో సూపర్‌వైజర్స్, సీడీపీవోల పనితీరుపై సమీక్షించి లక్ష్యాల్లో వెనుకబడిన వారిని కారణాలు అడిగి తెలుసుకుని, తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు జారీ చేశారు. అంగన్వాడీ కేంద్రాలను పటిష్టంగా నిర్వహించాలని పిల్లల హాజరు వందశాతం ఉండేలా కృషి చేయాలన్నారు. కేంద్రానికి పిల్లలు రాకున్నా హాజరు వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యఆరోగ్యశాఖకు సంబంధించి సమీక్షిస్తూ వివిధ అంశాల్లో శ్రద్ధ పెట్టి లక్ష సాధనకు కృషి చేయాలని మెడికల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కొన్ని మండలాలు ప్రగతి సాధనలో బాగా పనిచేస్తున్నాయని, మిగిలిన మండలాలు వెనుకబడి ఉన్నాయని, ఇందుకు గల కారణాలను లోపాలను గుర్తించి సరిదిద్దుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. ఏఎన్ఎం తరచూ పాఠశాలలను సందర్శించి వైద్యసేవలు అందించాలన్నారు. జీరో శాతం ప్రగతి ఉన్నవారు మూడురోజుల లోపల ప్రగతి సాధించకపోతే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో, ఐసీడీఎస్ పీడీ, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సింగ్ పరీక్షలంటే... కాసుల పంటే

- మాస్ కాపీయింగ్‌కు అడ్డాగా రిమ్స్ వైద్యశాల
- రూ.80వేల నుంచి లక్ష వరకు నర్సింగ్ కళాశాలల నుంచి డబ్బు వసూళ్లు
- డబ్బుల కోసం బాహాటంగా గొడవపడిన సిబ్బంది
- గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు


రిమ్స్ వైద్య కళాశాల ఆవరణలో సమాధానాల స్లిప్పులు


మైక్రో జిరాక్స్ తీసిన సమాధానాల స్లిప్పులు

కడప సెవెన్ రోడ్స్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కడప నగర పరిధిలోని పుట్లంపల్లె వద్దగల ప్రభుత్వ వైద్యకళాశాల (రిమ్స్) మాస్ కాపీయింగ్‌కు అడ్డాగా మారింది. దాదాపు 8 నర్సింగ్ కళాశాలలకు సంబంధించి విద్యార్థులకు పరీక్షలను రిమ్స్ ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల్లో విద్యార్థులు కాపీయింగ్ పాల్పడేందుకు ప్రతి నర్సింగ్ కళాశాల వైద్య కళాశాలకు సుమారు రూ.80వేల నుంచి లక్ష రూపాయల వరకు డబ్బు సమర్పించినట్లు సమాచారం. దీంతో నర్సింగ్ విద్యార్థులు పరీక్షల్లో కాపీయిగ్‌కు పాల్పడేందుకు పూర్తిగా స్వేచ్ఛను ఇస్తూ వైద్య కళాశాల అధికారులు చూసీచూనడట్లు వ్యవహరిస్తున్నారు. పరీక్ష మొదలవగానే ప్రశ్నాపత్రాన్ని బయటకు పంపిస్తున్నారు. కాసేపటికి జవాబులను రాసుకువచ్చి విద్యార్థులకు చెబుతున్నారు. నర్సింగ్ పరీక్షలను వైద్య కళాశాలలోని గ్యాలరీ, డెమో హాల్‌లో నిర్వహిస్తున్నారు. అక్కడ కెమెరాలు పనిచేయవు, ఉండవు. నర్సింగ్ కళాశాలల నుంచి డబ్బు అందుకోవడంతో వైద్య కళాశాల అధికారులు మాస్ కాపీయింగ్‌కు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

అదనపు వసూళ్లు

నర్సింగ్ కళాశాల నుంచి గుత్త మొత్తంలో డబ్బులు అందుతున్నా పరీక్ష సమయంలో విద్యార్థులకు మరింత సహాయ సహకారాలు అందిస్తామంటూ వైద్య కళాశాల సిబ్బంది అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. విద్యార్థుల వద్ద రూ.2వేల నుంచి రూ.4వేలు వసూళ్లు చేసి త్వరితగతిన సమాధానాలు చేరవేస్తున్నారు. జవాబులను మైక్రో జిరాక్స్ ద్వారా తెప్పించి విద్యార్థులకు అందిస్తున్నారు. ఇదంతా వైద్య కళాశాలలో బాహాటంగా జరుగుతున్నా మాకెందుకులే అన్నట్లు కొందరు సిబ్బంది ఉంటున్నారు.

డబ్బుల పంపకాల్లో గొడవ

నర్సింగ్ కళాశాలల విద్యార్థులు, యాజమాన్యాలు ఇచ్చిన డబ్బుల పంపకంలో తేడాలు రావడంతో ఇద్దరు ప్రభుత్వ వైద్యకళాశాల సిబ్బంది 6వ తేదీ సోమవారం గొడవపడినట్లు సమాచారం. వైద్య కళాశాలకు చెందిన సీనియర్ అసిస్టెంట్, అటెండర్‌ల మధ్య ఈ గొడవ జరిగినట్లు తెలుస్తోంది. వైద్య కళాశాల అధికారులకు సైతం ఈ డబ్బుల పంపకాల్లో వాటా ఉండడంతో సదరు సంఘటన బయటకు రానీయకుండా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గ్రీవెన్స్ సెల్‌లో సైతం ఫిర్యాదు

వైద్య కళాశాలలో కాపీయింగ్ జరుగుతుందని, డబ్బు వసూళ్లు చేస్తున్నారని కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. అధికారులు పట్టించుకోకపోవడంతో ఎవరూ ఏమి చేయలేరన్న ధీమాతో ఇంతా జరుగుతోంది.

జిల్లా అధికారుల అలసత్వమా..

గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా ఇలాంటి అక్రమాలకు అలవాటు పడిన సిబ్బంది కూటమి ప్రభుత్వంలో సైతం ఏమాత్రం భయం లేకుండా అందరికీ తెలిసేలా డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. దీనిపై సాక్షాత్తు గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. వైద్యకళాశాలలో నర్సింగ్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌పై ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ స్పందిస్తూ పరీక్షల్లో ఇలాంటివి ఏమీ జరగలేదు. మేము నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

ఏడాది పీజీ ప్రవేశాలకు దరఖాస్తులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ పూర్తిచేసుకున్న విద్యార్థులకు లెటరల్ ఎంట్రీ విధానంలో ఏడాది పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి వెల్లడించారు. జాతీయ విద్యా విధానం-2020 అమలులో భాగంగా నూతనంగా ఏడాది పీజీ కోర్సు (2024-25 విద్యా సంవత్సరం) నోటిఫికేషన్ సందర్భంగా ఆయన తన ఛాంబర్‌లో ఇన్‌చార్జి రిజిస్ట్రార్, ప్రిన్సిపల్ ఆచార్య ఏజీ దాము, డీన్‌లు ఆచార్య కంకణాల గంగయ్య, ఆచార్య వై.సుబ్బరాయుడు, సీడీసీ డీఎన్ ఆచార్య రఘుబాబు, ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌తో భేటి అయ్యారు. నోటిఫికేషన్ సంబంధించి వారితో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైవీయూ పరిధిలోని అఫిలియేషన్ కలిగిన అనుబంధ కళాశాలలో పీజీ కోర్సులకు అనుమతి ఇచ్చామన్నారు. హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ, బయోకెమిస్ట్రీ, బయో టెక్నాలజీ, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కామర్స్, సైకాలజీ, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ తదితర కోర్సుల్లో ప్రవేశాలు ఉంటాయన్నారు. 2024-25 విద్యాసంవత్సరానికి దరఖాస్తులు కోసం వైవీయు.ఇడియు.ఇన్‌ను సంప్రదించాలని సూచించారు. వెబ్‌సైట్‌లో విశ్వవిద్యాలయంలో లభించే కోర్సులు, సీట్లు సంబంధిత నిబంధనల గల బ్రోచర్ ఉంటుందన్నారు. 21వ తేదీ విశ్వవిద్యాలయ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్‌లో ప్రవేశాల కౌన్సిలింగ్ ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు నిర్ణీత సమయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో ఇజితెమా

- రెండో రోజు వేలాదిగా తరలివచ్చిన ముస్లింలు


ఇజితెమాలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఆత్మకూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఆత్మకూరు కేంద్రంగా జరుగుతున్న ఉమూమి తబ్లీగీ ఇజితెమా కార్యక్రమం రెండో రోజైన బుధవారం భక్తిశ్రద్ధల నడుమ సాగింది. కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల నుంచి ఇజితెమా కార్యక్రమానికి మంగళవారం రాత్రికే వేలాది సంఖ్యలో ముస్లింలు చేరుకున్నారు. దీంతో బుధవారం తెల్లవారు జాము నుంచే సామూహిక ప్రార్థనలు మొదలయ్యాయి. అలాగే ఢిల్లీ, హైదరాబాద్‌ల నుంచి విచ్చేసిన ఉలేమాలు మహ్మద్ ప్రవక్త నిర్దేశించిన మార్గదర్శకాలను బోధించారు. కాగా వివిధ జిల్లాల నుంచి వచ్చే వారికి ఏలోటు రానివ్వకుండా ఇజితెమా నిర్వహణ కమిటీ వారు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు. తాగునీరు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, విద్యుత్ తదితర సదుపాయాలను సమకూర్చారు. అదేవిధంగా ఇజితెమాకు హాజరైన ముస్లిం లకు దాతలు స్వచ్ఛందంగా పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. ఇదిలావుంటే ఇజితెమా ప్రాంగణమంతా ఎక్కడా చూసినా సందడి వాతావరణం నెలకొంది.

ఇజితెమాను సందర్శించిన ప్రముఖులు : ఆత్మకూరు పట్టణ శివార్లలోని శ్రీశైలం రస్తాలో జరుగుతున్న ఇజితెమా కార్యక్రమాన్ని బుధవారం రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ ఆదిరాజ్‌సింగ్ రాణాలు సందర్శించారు. ఈ సందర్భంగా ఇజితెమా ఏర్పాట్ల గురించి కమిటీ వారిని అడిగి తెలుసుకున్నారు. మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ పవిత్రమైన ఉమూమి తబ్లీగీ ఇజితెమా కార్యక్రమ నిర్వహణలో ప్రభుత్వ భాగస్వామ్యం ఉండటం శుభపరిణామమన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఇజితెమాకు హాజరైన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు.

భార్య, కూతురిని చంపిన నిందితుడు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఎన్.వెంకట రమణ

పులివెందుల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలం టి.తుమ్మలపల్లెలో ఈనెల 6వ తేదీ భార్య, కూతురిని చంపిన నిందితుడిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ ఎన్.వెంకటరమణ తెలిపారు. బుధవారం స్థానిక రూరల్ పోలీ సు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. తుమ్మల గంగాధరెడ్డి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగి స్తూ.. రోజూ మద్యం తాగి వచ్చి భార్యతో గొడవ పడుతుండేవాడు. 6వ తేదీ రాత్రి 9గంటలకు మందు తాగి ఇంటికి వచ్చిన గంగాధర్‌రెడ్డి తన భార్య శ్రీలక్ష్మితో గొడవ పడి ఇంట్లో ఉన్న ఇనుప పైపును తీసుకుని ఆమె తలపైన గట్టిగా కొట్టగా, కూతురు గంగోత్రి మంచంపై నుంచి లేచి అడ్డుపడింది. దీంతో అదే పైపుతో కూతురు తలపై కూడా కొట్టడంతో ఇద్దరూ గట్టిగా అరుస్తూ తల నుంచి రక్తం కారుతూ చెరో మంచంపై పడిపోయారు. కొన ఊపిరితో ఉన్న ఇద్దరినీ ఇంట్లోని మచ్చుకత్తితో నరకగా రక్తం కారి చనిపోయారని సీఐ వివరించారు. ఈ కేసులోని నిందితుడు గంగాధర్‌రెడ్డిని బుధవారం మధ్యాహ్నం 2.30గంటలకు టి.తుమ్మలపల్లె రోడ్డులో చీనీ తోట వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు.

విషద్రావణం తాగి యువకుడు మృతి

చెన్నూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు అరుంధతీనగర్‌కు చెందిన కొండిగారి ప్రదీప్ (18) అనే యువకుడు విషద్రావణం తాగి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... స్థానిక అరుంధతీనగర్‌కు చెందిన సుబ్బరాయుడు కుమారుడు ప్రదీప్ గుజరాత్ రాష్ట్రంలోని రాజ్‌కోట్ జిల్లాలో మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతున్నాడు. ఇటీవల సెలవుల రీత్యా చెన్నూరుకు వచ్చిన ఆ యువకుడు ఇంటి వద్ద అల్లరి చేస్తుండడంతో అతని తల్లి లక్షుమ్మ మందలించింది. దీంతో ఈ నెల 6న మనస్తాపం చెంది విషద్రావణం తాగాడు. దీంతో పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో చికిత్స నిమిత్తం స్థానిక చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి కడప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కాలువలో పడి ఆర్టీసీ డ్రైవర్ మృతి



చాపాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లవోలు గ్రామంలో బుధవారం మధ్యాహ్నం మిండాల వెంకటేశ్వర్లు (59) మద్యం తాగి మురికి కాలువలో పడి మృతి చెందాడు. ఆయన ఇంటి బయట ఉన్న అరుగుపై పడుకుని పక్కకుదొర్లి కాలువలో పడటంతో ఈ సంఘటన జరిగింది. కొంతసేపటికి ఇంటి పక్కనున్న మహిళలు గమనించి ఇతరుల సహాయంతో అతన్ని కాలువలో నుంచి బయటకు తీయగా.. అప్పటికే మృతి చెందాడు. వెంకటేశ్వర్లు మైదుకూరు ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. అతనికి భార్య, కూతుర్లు ఉన్నారు.

మల్లెపూల తోట దగ్ధం



కమలాపురం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జీవం పేట గ్రామంలో మల్లెపూల తోటను గుర్తు తెలియని దుండగులు కాల్చి వేసినట్లు రైతు నవనీశ్వర్‌రెడ్డి తెలిపారు. కొండాయపల్లెకు చెందిన నవనీశ్వర్‌రెడ్డి 1.5 ఎకరాల పొలం కౌలుకు తీసుకుని అందులో మల్లెతోట సాగు చేశాడు. బుధవారం పొలం వద్దకు వెళ్లి చూసేసరికి తోట కాలి దగ్ధమైంది. దాదాపు రూ.3లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు. గుర్తు తెలియని దుండగులు కాల్చి ఉంటారని అనుమానం వ్యక్తం చేశాడు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్తానని రైతు తెలిపాడు.

అంతర్ విశ్వవిద్యాలయాల బ్యాడ్మింటన్ పోటీలకు ఎస్‌సీఎన్‌ఆర్ కళాశాల విద్యార్థి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్ విశ్వవిద్యాలయాల బాల్‌బ్యాడ్మింటన్ మహిళల టోర్నమెంట్‌కు ఎస్‌సీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎంపికైనట్లు ప్రిన్సిపల్ చంద్రశేఖర్, ఫిజికల్ డైరెక్టర్ నిషాల్ తెలిపారు. కళాశాల బీకాం తృతీయ సంవత్సరం విద్యార్థిని వై.అరుణ మంగళవారం యోగివేమన యూనివర్శిటీలో జరిగిన మూడో విడత అంతర్ కళాశాలల పోటీలలో ప్రతిభ కనబరచి అంతర్‌విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపికైంది. తమిళనాడులోని అలగప్ప యూనివర్శిటీలో త్వరలో జరిగే అఖిలభారత అంతర్ విశ్వవిద్యాయాల పోటీల్లో ఆ విద్యార్థిని పాల్గొంటుంది.

అంతర్‌జిల్లా ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు


బైకుల దొంగలను అరెస్టు చూపుతున్న పోలీసులు

కమలాపురం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వరుస ద్విచక్ర వాహనాల దొంగతనానికి పాల్పడుతున్న అంతర్ జిల్లా బైకుల దొంగ భరత్‌కుమార్ అనే యువకుడిని అరెస్టు చేశామని సీఐ రోషన్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ ప్రతాప్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డీఎస్పీ వెంకటేశ్వర సహకారంతో మండల పరిధిలోని ఖాజీపేటకు పోయే దారిలో ఉన్న పాగేరు వంక వద్ద పోలీసులు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదస్థితిలో ఉన్న యువకున్ని గుర్తించి అదుపులోకి తీసుకుని.. అతన్ని విచారించగా బైకులు దొంగతనం చేస్తున్నట్లు తేలిందన్నారు. ఇతను పలు జిల్లాల్లో ద్విచక్ర వాహనాల దొంగతనానికి పాల్పడిన అంతర్ జిల్లా దొంగ భరత్ కుమార్‌గా గుర్తించామన్నారు. అతనిది ఖాజీపేట మండలం తుడుములదిన్నె గ్రామం అని... భరత్‌కుమార్ చిన్నప్పటి నుంచి చెడు వ్యసనాలకు అలవాటు పడి డబ్బుల కోసం బైకు దొంగతనాలకు పాల్పడేవాడు. దొంగలించిన బైకులను అమ్ముకునేవాడు. అదే క్రమంలో కమలాపురంలో గతంలో దొంగతనం చేసిన బైకులను బుధవారం అమ్మాలని ప్రయత్నించే క్రమంలో అరెస్టు చేశామన్నారు. అతని దగ్గర నుంచి ప్లాటినా 100 సీసీ ఏపీడీ4 బీసీ 4323, యమహా ఎఫ్‌జెడ్ఎస్ నెంబరు 02 బీసీ 5500 హెచ్ఎఫ్ డీలక్స్ ఏపీ 39 కేఆర్ 9613 గల మూడు బైకులను స్వాధీనం చేసుకున్నామన్నారు. అరెస్టు చేసిన నిందితులపై ఇది వరకే ఖాజీపేట, జమ్మలమడుగు, కమలాపురం, తాడిపత్రి, రైల్వేకోడూరు పోలీసుస్టేషన్లలో బైకు దొంగతనం కేసులు ఉన్నట్లు వివరించారు. నిందితుని అరెస్టు చేయడంలో సహకరించిన పోలీసులకు అభినందనలు తెలుపు తున్నామన్నారు.

ప్రాజెక్టులను పూర్తి చేసి రైతాంగాన్ని ఆదుకోవాలి



రైతు సంఘం జిల్లా రెండవ మహాసభలకు ర్యాలీగా వస్తున్న రైతు సంఘం నేతలు, సీపీఐ నేతలు

రాయచోటిటౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రాయచోటి పట్టణంలోని ఎన్జీవో హోంలో ఏపీ రైతు సంఘం అన్నమయ్య జిల్లా రెండవ మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి సమస్యలు తీరాలంటే హంద్రీ-నీవా నుంచి వెలిగల్లుకు నీరు వదలాలన్నారు. వెలిగల్లు నుంచి చిన్నకాలువలు, పెద్ద కాలువలు పూర్తి చేసి ఆ కాలువలకు నీరు వదిలితే చెరువులకు, బోర్లకు నీరు అందుబాటులో ఉండి రైతులకు మేలు జరుగుతుందన్నారు. రాయచోటి నియోజకవర్గం లోని 6 మండలాల్లో సాగుకు వీలవుతుందన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి మాట్లాడారు. సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, డాక్టర్ మహేశ్వర్‌రాజు, అర్చనా విద్యాసంస్థల డైరెక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, రైతు సంఘం ఏరియా కార్యదర్శి బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీమ ప్రాంతానికే గర్వకారణం
రాజంపేట అన్నమాచార్య యూనివర్శిటీ




డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అన్నమాచార్య విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, చొప్పా గంగిరెడ్డి తదితరులు

రాజంపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాజంపేట అన్నమాచార్య యూనివర్శిటీ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకుని రాయలసీమకే తలమాణికంగా మారిందని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. అన్నమాచార్య సిల్వర్ జూబ్లి ఉత్సవాల సందర్భంగా రెండో రోజు బుధవారం రాత్రి జరిగిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అన్నమాచార్య కమ్యూనిటీ రేడియేటేషన్ మెగా హెగ్జైస్‌ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత చొప్పా గంగిరెడ్డి చిన్నతనం నుంచి కష్టపడి తమ స్వగ్రామంలో అన్నమయ్య పేరిట విద్యా సంస్థలను నెలకొల్పారన్నారు. ఈ ప్రాంతీయులకు ఉన్నత విద్యను అందించి వేలాది మందికి ఇంజనీరింగ్ ఇతరత్రా ఉద్యోగాలు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఏరోనాటికల్ సొసైటీ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి మాట్లాడుతూ అన్నమాచార్యలో ఉత్తమ శిక్షణతో పాటు ఉన్నత విద్యా ప్రమాణాలను పాటిస్తూ కొత్త కొత్త విషయాలకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు.

జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ డాక్టర్ హెచ్.సుదర్శన్‌రావు, వైవీయూ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ క్రిష్ణారెడ్డి, రాష్ట్ర ఫార్మసీ ప్రతినిధి పల్లె రఘునాథ్‌రెడ్డి, రాలసీమ గ్రూప్స్ ఛైర్మన్ కొండారెడ్డి, కేఎస్ఆర్ఎం గ్రూపు కరస్పాండెంట్ రాజేశ్వరి, టెక్ మహేంద్ర ప్రతినిధులు అబ్దుల్ రహీం, ఐటీసీ ఇన్ఫోటెక్ ఎండీ జోషువాడేవిడ్, సినీ ప్రము ఖులు సోమసుందరం, లాస్య, జయచంద్రలు మాట్లాడుతూ అన్నమాచార్య సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో తాము పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అన్నమాచార్య యూనివర్శిటీ వ్యవ స్థాపక అధ్యక్షుడు, చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి, ప్రో చాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి, ట్రస్టు ఛైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ ఎస్ఎంవీ నారాయణ, రిజిస్ట్రార్ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దు

విద్యార్థులు చిన్నతనం నుంచే డ్రగ్స్, ఇతరత్ర మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా బాగా చదువుకుంటూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం రాజంపేట అన్నమచార్య యూనివర్శిటీ నుంచి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా వేలాదిమంది విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించగా ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు యువకులు, విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటుపడి తమ జీవితాన్ని చిన్నతనంలోనే సర్వనాశనం చేసకుంటున్నారన్నారు. దీనివల్ల వారిపై పెట్టుకున్న ఆశలు అడియాశలై తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోతున్నారన్నారు. సినీనటులు కేవీ ప్రదీప్, అన్నమాచార్య యూనివర్శిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు, చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి, ప్రోచాన్సలర్ అభిషేక్‌రెడ్డి, ఛైర్మన్ రామచంద్రారెడ్డి, డీఎస్పీ సుధాకర్, వైస్ ఛైర్మన్ ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ ఎస్ఎంవీ నారాయణ, రిజిస్ట్రార్ మల్లికార్జునరావు, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి ట్రిపుల్‌ఐటీకి సెలవులు

వేంపల్లె, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీకి సంక్రాంతి సెలవులు ప్రకటించారు. ఈనెల 11వ తేదీ నుంచి 19వ తేదీ వరకు సెలవులు ఇచ్చారు. ప్రస్తుతం పరీక్షలు రాస్తున్న కొందరు విద్యార్థులకు పూర్తి కాగా బుధవారం నుంచే ఇళ్లకు బయలుదేరారు. తిరిగి 20వ తేదీ ట్రిపుల్‌ఐటీ తరగతులు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు.

అలసత్వం వహిస్తే సహించం


అధికారులు, సర్పంచులతో మాట్లాడుతున్న రైతు కూలీలు

వల్లూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా నిరుపేదల కోసం ఏర్పాటు చేసిన హామీ పథకాల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డ్వామా అడిషనల్ పీడీ నాగరత్నమ్మ అన్నారు. బుధవారం 2023- 24 ఆర్థిక సంవత్సరంలో చేసిన ఉపాధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీపై వల్లూరులో నిర్వహించిన ప్రజావేదికలో అడిషనల్ పీడీ మాట్లాడుతూ తనిఖీ బృందం నిక్కచ్చిగా పనిచేయాలని సూచించారు. కొన్ని గ్రామాల్లో ఒకే ఇంట్లో రెండు మూడు జాబ్‌కార్డులు ఉన్నాయని వాటిని తక్షణమే తొలగించి ఫీల్డ్ అసిస్టెంటుకు శాఖాపర నోటీసులు ఇచ్చి ఆ డబ్బు రికవరీ చేయాలని ఆదేశించారు. 2024-25-26కు పనులు గుర్తించాలని ముఖ్యంగా రైతులకు ఉపయోగపడే పనులు గుర్తించాలన్నారు. షరా మామూలే ఓపెన్‌ఫోరం కాస్త త్వరగా ముగించారు. మండలంలో దాదాపు 14 గ్రామ పంచాయతీల్లో బృందం తనిఖీ చేపట్టింది. దాదాపు ఐదు కోట్లకు పైగా డబ్బు, 744 పనులు పరిశీలించారు. కాకపోతే రికవరీ శాతం కేవలం 17672 మాత్రమే రికవరీ చేశారు. కార్యక్రమంలో ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ రఘురాం, డీఈ రామలింగారెడ్డి, సోషల్ ఆడిట్ కన్నారెడ్డి, ఏపీఓలు సుధారాణి, పార్థసారధి విష్ణువర్ధన్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వల్లూరు మండల టీడీపీ ఇన్‌చార్జ్ నాగేశ్వర్‌రెడ్డి, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సేవ చేయడం హర్షణీయం

మదనపల్లిలోని రెసిడెన్సియల్ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సొసైటీకి ప్రశంసలు


సమావేశంలో మాట్లాడుతున్న శశిభూషణ్‌రెడ్డి


కడప మారుతీనగర్ జనవరి 8, (ఆంధ్రజ్యోతి): సమాజంలోని నిరుపేదలకు కాసింతైనా సాయం చేయాలనే ధ్యేయంతో జీఎంఆర్ (గవర్నమెంట్ మోడల్ రెసిడెన్సియల్ పాలిటెక్నిక్ కళాశాలల)ఓల్డ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ (కడప) ప్రతినిధులు ముందుండడం అభినందనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగళ శశిభూషణ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎన్‌జీఓ కాలనీలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సొసైటీ ప్రతినిధులతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ రక్తదానం, అన్నదానం, మెడికల్ క్యాంపు, నిరుపేదల వివాహాలకు, అనారోగ్య సమస్యలకు సాయం అందిస్తూ ముందుకు సాగుతున్న తీరు హర్షణీయమన్నారు. 1987 ఉమ్మడి రాష్ట్రంలో నాటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు పేద విద్యార్థుల విద్యా పురోగతి కోసం రాష్ట్రంలోని శ్రీశైలం, మదనపల్లి ప్రాంతాల్లో గవర్నమెంట్ మోడల్ రెసిడెన్సియల్ పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. కాగా ఇందులో చదివిని అనేకులు వివిధ హోదా ల్లో వున్నారన్నారు. మదనపల్లిలోని రెసిడెన్సియల్ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల్లో ప్రధానంగా ప్రస్తుత రాష్ట్ర వైద్య, విద్య శాఖ మంత్రి సత్యకుమార్ కూడా అక్కడే చదివినట్లు వెల్లడించారు. కాగా అందులో చదివిన విద్యార్థులు ఒక సొసైటీగా ఏర్పడి సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ సాగుతున్న తీరు సంతోషమన్నారు. పూర్వ విద్యార్థుల ప్రతి ఇంట్లో నూతన సంవత్సర క్యాలెండర్ వుండాలనే ధ్యేయంతో 2025 కేలండర్‌ను సొసైటీ రూపొందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సొసైటీ కన్వీనర్ నిత్యా, ప్రతినిధులు రాజారావు, (న్యాయవాది) నాగేశ్వర రెడ్డి, ప్రసాద్, బాలరాజు, గంగయ్య, చంద్రశేఖర్, మహేంద్రారెడ్డి, శోభన్‌బాబు, హరి, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి పవన్ కుమార్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు కల్పించే స్వయం ప్లస్

కడప ఎడ్యుకేషన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్వయంప్లస్ ద్వారా విద్యార్థులకు విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా విశ్వవిద్యాలయం కృషి చేస్తోందని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి స్వయంప్లస్ అమలు తీరుతెన్నులపై రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల ఉపకులపతులతో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో విశ్వవిద్యాలయం గురించి, ఇక్కడ అమలు చేస్తున్న కోర్సుల గురించి వీసీ రాష్ట్ర ఉన్నత విద్యామండలికి నివేదించారు. విద్యార్థులకు శిక్షణ ఇస్తూ పరిశ్రమల్లో అవకాశాలు కల్పించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ హ్యూమన్ రీసోర్స్ మేనేజ్‌మెంట్‌లో విద్యార్థులు హైదరాబాద్ స్కిల్ డిజైర్ టెక్నాలజీ ద్వారా శిక్షణ పొందుతున్నారని తెలిపారు. విద్యార్థుల ప్రయోజనార్థం తాజాగా హైదరాబాద్ ఇన్నొవేటివ్ సైబర్ టెక్ సంస్థతో ఎంఓయూ కుదుర్చుకున్నామన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు ఉమామహేశ్వరి, దక్షిణామూర్తి, చెన్నై ఐఐటీ నిపుణులు సారధి, అశోక్ పలు సూచనలు చేశారు. అన్ని విశ్వవిద్యాలయాలు ఒకే మాసంలో విద్యార్థుల శిక్షణ ప్రారంభించాలని సూచించారు. స్వయంప్లస్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణ, జర్నలిజం అధ్యాపకులు, డాక్టర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

డీఆర్పీ ఎంపికకు స్పందన

కడప ఎన్టీఆర్ సర్కిల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఏపీ ఫుడ్ కార్పొరేషన్‌లో డీఆర్పీలుగా ఉపాధి ఎంపికకు స్పందన లభించింది. బుధవారం టీటీడీసీలోని స్కిల్ కళాశాలలో డీఆర్‌డీఏ, సిడాప్ ఆధ్వర్యంలో జిల్లా రిసోర్స్ పర్సన్‌గా డైరెక్ట్ ప్లేస్‌మెంట్ ద్వారా నియామకానికి దరఖాస్తులు స్వీకరించారు. నిర్వహించిన పరీక్ష, ఇంటర్వ్యూలకు 224 మంది దరఖాస్తు చేసుకోగా 128 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 101 మంది ఉత్తీర్ణత సాధించడంతో ఇంటర్వ్యూలు నిర్వహించారు. తుది ఎంపిక జాబితాను రెండు రోజుల్లో అభ్యర్థులకు ఫోన్ ద్వారా తెలియజేస్తామని పీడీ డి.ఆనంద్‌నాయక్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జాబ్స్ మేనేజర్ హరప్రసాదరావు, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ మారుతి, సిడాప్ డైరెక్ట్ ప్లేస్‌మెంట్ ట్రైనర్ పృథ్వీరాజ్, సిడాప్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్సీ కులగణనపై 12 వరకు అభ్యంతరాల స్వీకరణ

కడప ఎన్టీఆర్ సర్కిల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సామాజిక తనిఖీ అభ్యంతరాల గడువును మరోమారు పొడిగించినట్లు సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు కె.సరస్వతి పేర్కొన్నారు. కులగణనపై 12 వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామ, వార్డు సచివాలయ కార్యాలయాల్లో ఎస్సీ కులగణన గణాంకాలు ప్రదర్శించినట్లు తెలిపారు. 12వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారన్నారు. 20న సంబంధిత సచివాలయాల్లో తుది జాబితాను ప్రదర్శించనున్నట్లు వివరించారు. ఖచ్చితత్వాన్ని పెంపొందించేందుకు సంబంధిత అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వివరాలను ర్యాండంగా తనిఖీ చేస్తారన్నారు. సోషల్ ఆడిట్‌ను ఆర్‌డీఓలు పర్యవేక్షిస్తారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు : డీఎస్పీ

పులివెందుల టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కోడిపందేలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ మురళీ హెచ్చరించారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఎక్కడైనా కోడిపందేలు, పేకాట, గోలీలాట, టెంకాయల పందేలు నిర్వహించినా, బెట్టింగ్ పెట్టినా చర్యలు తీసుకుంటామన్నారు. విలేకరులతో మాట్లాడారు. గతంలో ఇదే తరహా నేరాలకు పాల్పడి అరెస్టు అయిన వారిని పిలిపించి హెచ్చరిస్తామన్నారు. కోడిపందేలు నిర్వహకులు, కోడికత్తులు తయారు చేసేవారిపై, కోడి పుంజులకు కత్తులు కట్టేవారిపై నిఘా పెట్టామన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా సొంత ప్రాంతాలకు గ్రామాలకు వెళ్లే వారు ఇళ్లల్లో దొంగతనాలు జరగకుండా లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్) సద్వినియోగం చేసుకోవాలన్నారు. దొంగతనాల నివారణకు రాష్ట్ర పోలీసుశాఖ ప్రత్యేకంగా నిర్వహిస్తోందన్నారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ద్వారా రిక్వెస్ట్ పంపితే పోలీసులు ఇంటికి వచ్చి సీసీ కెమెరాలు పెడతారన్నారు. ప్రజలు పండుగ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

క్యాన్సర్‌పై అధునాతన పరిశోధనకు డాక్టరేట్


హేమలత

పులివెందుల టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): 'సింథసిస్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ పాలి శాఖరాయిడ్ బేస్డ్ హైడ్రోజెన్స్ ఫర్ కంట్రోల్ రిలీజ్ ఆఫ్ కీమోథెరపీ ఏజంట్స్ అండ్ యాంటీమైక్రోబియన్ అప్లికేషన్'పై పరిశోధనకు వైవీయూ డాక్టరేట్‌ను అందించింది. భాకరాపురం వాసులు రవిశేఖర్, కృష్ణమ్మ కుమార్తె హేమలత(మానవ శరీరంలో ఔషధ సరఫరా, గాయాలను త్వరగా నయం చేయడానికి నానో డ్రగ్ కనుగొన్న రసాయన శాస్త్ర శాఖ స్కాలర్) రసాయన శాస్త్ర విభాగ ఆచార్యులు కెఎస్‌వీ క్రిష్ణారావు పర్యవేక్షణలో సిద్ధాంత గ్రంథం విశ్వవిద్యాలయానికి సమర్పించారు. దీంతో ఆమెకు వైవీయూ పరీక్షల నిర్వహణ అధికారి ఆచార్య కేఎస్‌వీ క్రిష్ణారావు డాక్టరేట్‌ను జారీ చేశారు. ఈమె చేసిన అంశంపై పలు ప్రఖ్యాత అంతర్జాతీయ పబ్లికేషన్స్ ఎల్సివేర్, అమెరికన్ కెమికల్ సొసైటీ, స్ప్రింజర్ వంటి జర్నల్స్‌లో పరిశోధనాపత్రాలు, బుక్‌చాప్టర్స్ ప్రచురించారు. వైవీయూ రసాయన శాస్త్ర విభాగంలో డాక్టరేట్ అందుకున్న డి.హేమలతను తండ్రి రవి శేఖర్, పరిశోధన గైడ్ డాక్టర్ కేఎస్‌వీ క్రిష్ణారావును ఉప కులపతి ఆచార్య కె.క్రిష్ణారెడ్డి, కులసచివులు ఆచార్య పి.పద్మ, ప్రిన్సిపాల్ ఆచార్య, ఎస్.రఘునాథరెడ్డి, రసాయన శాస్త్ర అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

'ప్రజా పంపిణీ వ్యవస్థలో కానరాని కందిపప్పు'

కడప సెవెన్‌రోడ్స్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవ స్థలో కందిపప్పు కనిపించడం లేదని సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెం కటశివ, సహాయ కార్యదర్శులు కేసీ బాదుల్లా, మద్దిలేటి, నేతలు మునెయ్య, నాగేశ్వరరావ్ అన్నారు. బుధవారం తహసీల్దార్ నారా యణరెడ్డికి వినతిపత్రం సమర్పించిన వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ డిపోల ద్వారా అందిస్తున్న నిత్యావసరాలు ప్రజలకు ఊరటనివ్వడం లేదన్నారు. కేవలం మొక్కుబడిగా సరఫరా చేసి చేతులు దులుపుకొంటున్నారని ఆరోపించారు.

పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌తో నాణ్యమైన విద్యుత్ : ఎస్ఈ


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌తో నాణ్యమైన విద్యుత్ లభిస్తుందని ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ రమణ పేర్కొన్నారు. బుధవారం పకీర్‌పల్లె సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. వేస సమస్యల దృష్ట్యా పకీరుపల్లె ఉప కేంద్రంలోని పాత ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. ఈఈ, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్, టిప్పర్ సీజ్


కడప కలెక్టరేట్ జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో మైనింగ్ అధికారుల అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ త్వకాలు జరిపి, తరలిస్తే చర్యలు తప్పవని కడప తహసీల్దారు నారాయణ రెడ్డి హెచ్చరించారు. బుధవారం నానాపల్లి వద్ద కొండల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందడంతో వెంటనే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్వోలు వెళ్లి అడ్డుకున్నారు. గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు లేక పోవడంతో వెంటనే తహసీల్దారుకు సమాచారం అందించారు. గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న ఎక్స్‌కవేటర్, టిప్పర్‌ను తహసీల్దారు సీజ్ చేసినట్లు తెలిపారు.

రేపు ఎద్దలకొండలో ఏకాదశి పూజలు

వేంపల్లె, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పాపాఘ్ని నది ఒడ్డున ఎద్దుల కొండపై వెలసిన లక్ష్మీవృషభాచలేశ్వరస్వామి ఆలయంలో 10వ తేదీ శుక్రవారం వైకుంఠ ఏకాదశి పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ విశ్వనాథరెడ్డి, దేవస్థాన మాజీ సభ్యుడు రమణ తెలిపారు. భక్తులు ఉత్తర ద్వారం నుంచి వెళ్లి స్వామివారి దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అన్నక్యాంటీన్ పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అన్నక్యాంటీన్ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్ర పరుస్తూ ఉండాలని కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి సూచించారు. బుధవారం కడప నగరంలోని అన్నక్యాంటీన్‌లను పరిశీలించారు. జిల్లా పరిషత్ ప్రాంగణంలో ఉన్న అన్నక్యాంటీన్‌లో టోకెన్ సిస్టం పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. భోజనం నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. అన్న క్యాంటీన్‌లో ఆహారం శుభ్రంగా ఇవ్వాలన్నారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగసుబ్బయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





ఉత్తర ద్వార దర్శనం ఏర్పాట్లను పరిశీలించిన పుత్తా


ఏర్పాట్లను పరిశీలిస్తున్న పుత్తా నరసింహారెడ్డి

కమలాపురం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే గేటు వద్ద వెలసిన రాధాక్రిష్ణ మందిరంలో 10వతేదీ వైకుంఠ ఏకాదశిని పురస్కరించకుని ఉత్తర ద్వార దర్శనం ఏర్పాట్లను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పరిశీలించారు. బుధవారం ఆయన రాధాక్రిష్ణ ఆలయాన్ని దర్శించి జరుగుతున్న పనులను పర్యవేక్షించారు భక్తులంతా వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శినంలో ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. టీడీపీ మండల నేతలు వాసుదేవరెడ్డి, ఖాదర్‌బాషా, రాఘవరెడ్డి, కంకర సుబ్బారెడ్డి, దివాకర్రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, దాది రామయ్య, చిన్నసుబ్బారెడ్డి, రవీంద్రారెడ్డి, గుజ్జుల నారాయణ పాల్గొన్నారు.

వైఎస్ కుటుంబంతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి : వైసీపీ

కమలాపురం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేసింది వైఎస్ కుటుంబమేనని, ప్రస్తుతం ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు అనుమతులు తీసుకుని వచ్చింది కూడా జగన్ పాలనలోనే అని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కమలాపురం మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి అన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధి జరిగిందంటే అది వైసీపీ ప్రభుత్వంలోనే అని, ఆ ఘనత వైఎస్ జగన్ రెడ్డికి దక్కుతుందన్నారు. వైజాగ్‌లో ప్రధానితో కలిసి రోడ్‌షో కూడా చంద్రబాబు చేయడం సిగ్గుచేటన్నారు. ఉద్దానంలో కిడ్నీ రీసెర్చ్ సెంటరు, అత్యాధునిక సాంకేతికతో ఆస్పత్రి నిర్మించారన్నారు. వైసీపీ నేతలు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణను కలిసిన మిత్ర బృందం

కడప ఎడ్యుకేషన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మానస ఇన్ హోటల్‌లో మాజీ జేడీ లక్ష్మీనారాయణను ఆయన మిత్రబృందం కలిసింది. బుధవారం తిరుపతి నుంచి నంద్యాలకు వెళుతూ మార్గమధ్యలో కడపకు విచ్చేసిన ఆయన మాట్లాడుతూ కడప తన జన్మస్థలం అని, తన తండ్రి తాతలు కడప వారేనని, తన తాతగారు తహసీల్దార్‌గా కడపలో పనిచేశారని నాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నది ఆశయమని, తాను కృషి చేస్తానన్నారు. సాంకేతిక, పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయ రంగం సమాంతరంగా అభివృద్ధి సాధించాలన్నారు.



గుర్తు తెలియని వ్యక్తులు చదును చేశారు

ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు : తహసీల్దారు నారాయణ రెడ్డి

కడప కలెక్టరేట్ జనవరి 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని నాగరాజుపల్లి రెవెన్యూ గ్రామం, సర్వేనంబరు 71/1లో గుర్తు తెలియని వ్యక్తులు చదును చేశారని, ప్రభుత్వ స్థలం జోలికి వస్తే కఠిన చర్యలు తప్పవని కడప తహసీల్దారు నారాయణ రెడ్డి కబ్జాదారులను హెచ్చరించారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో పతాక శీర్షికన 'తగ్గేదేలే...' 'కూటమి ప్రభుత్వంలోనూ భూ కబ్జా లే' కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై కడపలో పెద్ద చర్చానీయాంశంగా మారింది. కడప తహసీల్దారు తన సిబ్బందితో వెళ్లి సర్వే నెంబరు 71-1లో పరిశీలించి విచారించినట్లు తెలిపారు. సర్వేనెంబరు71-1లో 2.52 ఎకరాల విస్తీర్ణం భూమి వాగుగా వెబ్‌ల్యాండ్‌లో ఆన్‌లైన్ నమోదైందన్నారు. ఇప్పటికే ప్రభుత్వ భూమిగా బోర్డు నాటామని, 10 సెంట్లు చదును చేశారన్నారు. స్థానికులను విచారించగా చదును ఎవరు చేశారనే విషయాన్ని ఎవరూ చెప్ప లేకున్నారన్నారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించి చర్యలు తీసుకోవాలనీ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించామని ఆయన ప్రకటనలో తెలిపారు.

12 నుంచి సంక్రాంతి సంబరాలు

పులివెందుల రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శిల్పారామం, ఉలిమెల్ల లేక్‌ఫ్రంట్‌లలో సంక్రాంతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పరిపాలన అధికారి బి.సుధాకర్ తెలిపారు. స్థానిక శిల్పారామంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ శిల్పారామం ఉలిమెల్ల లేక్‌ఫ్రంట్‌లలో 12 నుంచి 15 వరకు జరిగే కార్యక్రమాల్లో ముగ్గుల పోటీలు, ఇంద్రజాల ప్రదర్శనలు, హరిదాసుల ప్రదర్శన, గాలిపటాల ఎగురవేత, ఉంటాయన్నారు. ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు.

చేపల పెంపకంతో మహిళలకు ఉపాధి


బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఆనందనాయక్

ఎర్రగుంట్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చేపల పెంపకంతో మహిళా రైతులకు మంచి ఉపాధి లభిస్తుందని డీఆర్‌డీఏ పీడీ డి.ఆనందనాయక్ పేర్కొన్నారు. బుధవారం ఎర్రగుంట్లలోని చిలమకూరు, చిర్రాజుపల్లె, సున్నపురాళ్లపల్లె, కదిరివారిపల్లె, కర్చుకుంటపల్లె గ్రామాలకు చెందిన మహిళా రైతులతో క్లస్టర్‌గా ఏర్పాటు చేశారు. ఎర్రగుంట్ల వెలుగు భవనంలో సమావేశం నిర్వహించి చేపలపెంపకంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో డీఆర్‌డీఏ డీపీఎం సుబ్బారెడ్డి, ఏపీఎం జగదీశ్వరి, ఏ.మహమ్మద్ గౌస్, ఆర్.లక్ష్మి, సీసీలు, అకౌంటెంట్లు, ఫార్మర్‌మిత్రలు పాల్గొన్నారు.

గ్రామ సేవకులకు పదోన్నతులు కల్పించాలి


ఆర్డీవో కార్యాలయం ఎదురుగా నిరసన తెలుపుతున్న గ్రామ సేవకులు

జమ్మలమడుగు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయం ఎదురుగా బుధవారం గ్రామ సేవకుల రాష్ట్ర అధ్యక్షుడు జి.ధైర్యం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ముందుగా వారు ఆర్డీవో సాయిశ్రీకి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం కార్యాలయం ఎదురుగా నిరసన తెలిపి విలేకరులతో మాట్లాడారు. కొన్ని సంవత్సరాలుగా సమస్యలు పరిష్కారం చేయడంలేదని వాపోయారు. గ్రామ సేవకులకు కార్యాలయాల వద్ద నైట్ వాచ్‌మెన్లుగా డ్యూటీలు వేస్తున్నారని తెలిపారు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఉన్నట్లు తెలిపారు. గ్రామ సేవకులకు అర్హతను బట్టి నైట్ వాచ్‌మెన్లుగా, అటెండర్లుగా, రికార్డు అసిస్టెంట్లుగా తదితర పదోన్నతులు కల్పించాలని వారు కోరారు. అలాగే వేతనాలు పెంచాలని, ప్రతినెల వేతనం చెల్లించాలని తదితర సమస్యలపై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సేవకుల మండల అధ్యక్షుడు గురుమోహన్, ప్రధాన కార్యదర్శి ఖాజాహుస్సేన్, శాంతయ్య, ఉపాధ్యక్షులు బాలరంగడు, అశోక్, శ్రీధర్, విజయ్, వివిధ గ్రామాలకు చెందిన గ్రామ సేవకులు పాల్గొన్నారు.

ఇబ్బంది లేకుండా పూడికలు తీయండి

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండల పరిధిలో గోపవరం పంచాయతీ పరిధిలో ఉన్న కాలువ కట్టమీద ఉన్న ఇళ్లకు ఇబ్బంది లేకుండా పూడిక పనులు చేపట్టాలని సీపీఎం నాయకులు కోరారు. బుధవారం స్థానికులతో కలిసి సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి సత్యనారాయణ ,డీవైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాధ్, శారదబాబు, జాను, రామలక్ష్మి, లత, విమల, కాలువకట్ట ప్రజలు పాల్గొన్నారు.

రేషన్ బండి... ఇంటింటికీ రావడం లేదండీ...!


వరుసగా నిలబడి సరుకులను తీసుకుంటున్న మహిళలు

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికి రేషన్ పంపిణీ కార్యక్రమం బాలారిష్టాలను అధికమించలేకపోతోంది. గత ప్రభుత్వంలో కోట్ల రూపాయలు వెచ్చించి ఎండీయూ వాహనాలను అందుబాటులోకి తెచ్చారు. రూ.18 వేల వేతనంతో వాహనచోదకులు సహాయకుడిని నియమించుకుని ఇంటింటికి రేషన్ సరుకులు ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. క్షేత్రస్థాయిలో మాత్రం వీటి నిర్వహణ లోపభూయిష్టంగా మారింది. ఇంటింటికి వెళ్లాల్సిన రేషన్ బండి వీధుల్లోనే ఆగిపోతోంది. తెల్లకార్డుదారులు ఒకప్పుడు చౌక దుకాణానికి వెళ్లి సరుకులు తెచ్చుకునేవారు. ప్రస్తుతం కూడా వీధి చివరన ఆగి వాహనం వద్దకు వెళ్లాల్సి వస్తోందరి కార్డుదారులు చెబుతున్నారు. అప్పుడైనా, ఇప్పుడైనా నిరీక్షణ తప్పడంలేదని వాపోతున్నారు.

● **పనులు మానుకుని..:** ప్రొద్దుటూరు పట్టణ, మండల పరిధిలో 143 డీలర్ దుకాణాలు, 43 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. 70,260 తెల్లకార్డులు ఉన్నాయి. ప్రతినెలా 1 నుంచి 17వ తేదీ వరకు పట్టణ, గ్రామాల్లో తిరిగి ఇంటింటికి వెళ్లి సరుకులు పంపిణీ చేయాలి. క్షేత్రస్థాయిలో అలా జరుగడంలేదని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఆయా తేదీల్లో వాహనం వీధి చివరకు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని కార్డుదారులు వాపోతున్నారు.

● **అరకొర సరఫరా..:** జనవరి నెలలో చౌకబియ్యంతోపాటు చక్కెర, కందిపప్పు పంపిణీ చేశారు. కొన్ని ప్రాంతాల్లో జొన్నలు కూడా సరఫరా చేశారు. అయితే కందిపప్పు సరఫరాలో కొరత ఏర్పడడంతో ఉన్నమేరకు అందించారు. దీంతో చాలా మంది నిరుపేదలు ఒకరికి ఇచ్చి మరొకరికి లేదని చెప్పడం సరైన పద్ధతి కాదని కంపెనీదారులతో వాదనకు దిగారు. ఇతర ప్రాంతాల్లో కందిపప్పు ఇస్తుండగా తమకెందుకు ఇవ్వడంలేదని నిలదీశారు. చక్కెర ప్యాకెట్ రూ.17 వసూలు చేయాల్సి ఉండగా రూ.20 తీసుకుంటున్నారన్నారు. ఇదేమని ప్రశ్నించిన వారికి చిల్లరలేదని సమాధానం చెబుతున్నారని వివరించారు. దీంతో లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

● **కొరవడిన పర్యవేక్షణ..:** ప్రతినెలా రేషన్ పంపిణీ వంద శాతం పూర్తికావడంలేదని ఆరోపణలు ఉన్నాయి. దీంతో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వాహనచోదకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సరుకులు తెచ్చుకునేందుకు వీధి చివరకు వెళ్లిన వృద్ధులు, వికలాంగుల్లో కొందరికి వేలిముద్రలు సరిగ్గా నమోదు కావడంలేదు. దీంతో వారి ఇబ్బంది వర్ణనాతీతం. రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రేషన్ సరుకులను సరైన పద్ధతిలో వాహనాల ద్వారా ఇంటింటికి అందించాలని కార్డుదారులు విన్నవించుకుంటున్నారు.

● **మెరుగైన సేవలు అందేలా చర్యలు**

జనవరి నెల కందిపప్పు 60 శాతం మాత్రమే సరఫరా అయింది. రేషన్ సరుకుల సరఫరాలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటాం. లోపాలపై సమీక్షించి మెరుగైన సేవలు అందిస్తాం.

గంగయ్య, తహసీల్దారు, ప్రొద్దుటూరు.

అంగన్వాడీలతోనే చిన్నారుల ఆరోగ్యం

తవ్వా సావిత్రమ్మ, ఐసీడీఎస్ సీడీపీవో



ముఖాముఖి

చాపాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నారులు ఆరోగ్యంగా ఉండేందుకు వారిలోని పోషకాహారలోపం లేకుండా చేసేందుకు అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. చిన్నారుల్లో మానసిక, శారీరక పెరుగుదల, ఆటలాడుకునేందుకు ఈకేంద్రాలు ఉపయోగపడుతాయని, వారికి వ్యాధి నిరోధకత టీకాలు, తల్లులకు, గర్భిణీలకు బలమైన ఆహారం అందిస్తున్నాం, ఈ సెంటర్లు వారికి చాలా ఉపయోగకరంగా ఉన్నాయని తెలుపుతు న్న ఐసీడీఎస్ సీడీపీవో తవ్వా సావిత్రమ్మతో ప్రత్యేక ఇంటర్వ్యూ...

ప్రశ్న: ప్రాజెక్టు పరిధిలో ఎన్ని మండలాలు ఉన్నాయి.

జవాబు: 3 మండలాలు (చాపాడు, దువ్వూరు, బి.మఠం)

ప్రశ్న: ప్రాజెక్టు పరిధిలో ఎంత మంది సూపర్‌వైజర్లు ఉన్నారు.

జవాబు: ఆరుగురు

ప్రశ్న: ఎంత మంది అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ఉన్నారు.

జవాబు: 169 మంది అంగన్వాడీ కార్యకర్తలు,167 మంది ఆయాలు ఉన్నారు.

ప్రశ్న: ఎన్ని సెంటర్లు ఉన్నాయి.

జవాబు: 170 సెంటర్లు ఉన్నాయి.

ప్రశ్న: 0-5 సంవత్సరాలలోపు చిన్నారులు ఎంత మంది ఉన్నారు.

జవాబు: 7,552 మంది.

ప్రశ్న: సెంటర్లు పనిచేసే సమయం.

జవాబు: ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు .

ప్రశ్న: చిన్నారులకు చదువు కూడా బోధిస్తారా.

జవాబు: ఆహారం, విద్య అందిస్తున్నాం.

ప్రశ్న: ప్రతి రోజు తప్పకుండా ఏ ఆహారం పిల్లలకు ఇస్తున్నారు.

జవాబు: గుడ్లు, పాలు ఇస్తున్నాం.

ప్రశ్న: వారంలో చిన్నారులకు అందించే మెనూ వివరాలు తెలుపండి

జవాబు: అన్నం, సాంబారు, చిత్రాన్నం, పప్పు, ఆకుకూరలు, వెజిటబుల్ రైస్, పులిహోర అందిస్తున్నాం.

ప్రశ్న: ఎన్ని అంగన్వాడీ కేంద్రాలకు మరుగుదొడ్లు ఉన్నాయి.

జవాబు: 70 వాటికి ఉన్నాయి.

ప్రశ్న: ఎన్ని అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు, అద్దె భవనాలు ఉన్నాయి.

జవాబు: సొంత భవనాలు 97, అద్దె భవనాలు 73 ఉన్నాయి.

ప్రశ్న: కలెక్టర్ మండలానికి ఎన్ని నిధులు విడుదల చేశారు.

జవాబు: కలెక్టర్ ఆదేశాల మేరకు సొంత భవనాలు నిర్మించేందుకు స్థలాలు చూస్తున్నాం.

ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలి


రైతుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న రితీష్‌రెడ్డి

కాశినాయన జనవరి8 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి సమస్యను పరిష్కరించాలని బద్వేల్ టీడీపీ యువనాయకుడు కే.రితీష్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రామ రెవెన్యూ సదస్సుల్లో చివరిరోజైన బుధవారం సావిశెట్టిపల్లెలో తహసీల్దారు వెంకటసుబ్బయ్య అధ్యక్షతన నిర్వహించారు. మండల టీడీపీ నాయకు డు రాజారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అట్లూరు..: రైతుల నుంచి వచ్చిన ప్రతి భూసమస్యను తప్పకుండా పరిష్కరించడం జరుగుతుందని బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ తెలిపారు. బుధవారం కొండూరు గ్రామమనందు రెవెన్యూ సదస్సుకు హాజరయ్యారు. రైతుల నుంచి వచ్చిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలని తహసీల్దారు సుబ్బలక్ష్మిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, కోవెల నంద గోపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, సుధారాణి, ఎంపీటీసీ అమర్‌నాధరెడ్డి, సర్పంచ్ సుధారాణి, మహేశ్వర్‌రెడ్డి, జయక్రిష్ణారెడ్డి, మండల సర్వేయరు వేణుగోపాల్, ఆర్ఐరమణ, వీఆర్వోలు దొరబాబు, దస్తగిరి, వెంకటసుబ్బమ్మ, సచివాలయ సర్వేయరు సుబ్బారెడ్డి, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ప్రత్యేక పింఛన్ల లబ్ధిదారుల పరిశీలన



జమ్మలమడుగు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో 22 గ్రామాలకు సంబంధించి బుధవారం ప్రత్యేక పింఛన్లపై అధికారులు, డాక్టర్లు తనిఖీలు చేపట్టారు. ఇంటింటికి వెళ్లి రూ.15 వేలు పొందుతున్న పింఛన్‌దారులను వారి పుస్తకాలను పరిశీలించారు. మండలంలోని పలు గ్రామాల్లో మంచానికి పరిమితం అయిన, వివిధ కారణాల వలన ఇబ్బందులు పడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న పింఛన్‌దారుల ఇంటింటికి వెళ్లి డాక్టర్లు విచారణ చేపట్టారు. ఇలాగే అన్ని పింఛన్లకు తనిఖీలు ఉంటాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం వెంకట్ భరత్‌కుమార్, సూర్యనాయక్, మోరగుడి ఆరోగ్య కేంద్రం డాక్టర్ దీపిక, సిబ్బంది పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కలసపాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి విద్యార్థుల కోసం ఎస్టీయూ రూపొందించిన స్టడీ మెటీరియల్ చాలా ఉపయోగకరమని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని ఎగువ రామాపురం, కలసపాడు బాలుర, బాలికలు, కేజీబీవీ, శంకవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు 200 మంది పదో తరగతి విద్యార్థులకు రాజుపాలెం పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి దాతృత్వంతో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మెర్సిమాలిని, బ్రహ్మారెడ్డి, సలోమి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి ఇంటింటికి వెళ్లి ప్రచారం



జమ్మలమడుగు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని నాగులకట్ట శ్రీ చౌడేశ్వరీ దేవి కల్యాణ మండపంలో ఈనెల 19వ తేదీ నిర్వహించబోయే బీసీ కులాల ఆత్మీయ సమ్మేళనానికి ప్రతి ఒక్కరూ హాజరుకావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి కోరారు. బుధవారం జమ్మలమడుగు, పెద్దముడియం, మండలాల్లోని ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి బీసీలను సమావేశానికి హాజరుకావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎ.వీరభద్రయ్య, బీసీ నాయకుడు గొరిగె కొండప్ప, తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గంజికుంట ఈశ్వరయ్య, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె కాలపు హామీలను అమలు చేయాలి

జమ్మలమడుగు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కమిషనర్ వెంకటరామిరెడ్డికి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) యూనియన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. గత సమ్మెకాలపు ఒప్పందాల జీవోల కోసం ఈనెల 10వ తేదీన జరిగే మున్సిపల్ కార్మికుల రిలే నిరాహార దీక్షను మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టబోతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ ట్రెజరర్ శివ, అధక్షుడు నాగన్న, శేఖర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లారీ,కారు ఢీ

కొండాపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రధానరహదారి పై బుధవారం సాయంత్రం లారీ-కారు ఢీకొన్నాయి. స్థానిక సీఆంర్ కాంప్లెక్స్ బస్టాప్ వద్ద ప్రధాన రహదారి నుంచి లారీ అవతలి వైపునకు వెళుతుండగా, వెనుక వస్తున్న కారు లారీని ఢీకొంది. ఈ సంఘటనలో కారు టైరు ఊడిపడటంతో పాటు, కారు ముందు భాగం దెబ్బతింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి,

కాలువ నిర్మాణ పనులకు భూమిపూజ

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీలో ఉన్న లింగాపురం గ్రామంలోని యాదవుల కాలనీలో కాలువనిర్మాణ పనులకు సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి భూమిపూజ చేశారు. బుధవారం సుమారు 25 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి భూమిపూజ అనంతరం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో అన్ని చోట్ల రోడ్లు, కాలువ నిర్మాణాలను పూర్తి చేస్తామని, పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

కేలండర్ ఆవిష్కరణ

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఏపీఎంటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సర కేలండర్, డైరీలను బుధవారం ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, ఎంటీఎఫ్ నాయకులు రఫివుద్దీన్, మధు, ముక్తియార్ అహ్మద్, గౌస్‌లాజం, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుడు రాజశేఖర్‌రెడ్డికి ఘన నివాళులు



ప్రొద్దుటూరు టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన మాజీ సైనికుడు రాజశేఖర్‌రెడ్డి భౌతికకాయానికి మాజీ సైనికులు ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం ఆయన బెంగళూరులో అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం ప్రొద్దుటూరులోని నివాసంలో ఆయన భౌతిక కాయానికి ప్రొద్దుటూరు డివిజన్ సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మాజీ సైనికులు జాతీయ జెండాను కప్పి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు డివిజన్ మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాల వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి సాంబశివారెడ్డి , మాజీ సైనికులు నెల్సన్, మోహన్, నారాయణరెడ్డి, ఓబులేసు, పెద్దన్న, శంకర్‌రెడ్డి, ఎంఆర్‌కే రెడ్డి పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు

జమ్మలమడుగు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో చరిత్ర కలిగిన నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఈనెల 10వ తేదీ శుక్రవారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని భారీ ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో ప్రధాన గేటు వద్ద వెనుక భాగంలో భారీకేడ్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆలయ అధికారి మోహన్ మాట్లాడుతూ శుక్రవారం ఉదయాన్నే అయిదు గంటల నుంచి భక్తుల రద్దీ ఉంటుందన్నారు. వైకుంఠ ఏకాదశి దర్శనం కోసం పట్టణంలోని సుమారు 10 వేల మందికిపైగా ప్రతి ఏడాది హాజరవుతారన్నారు.

ప్రొద్దుటూరు టౌన్..: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఇస్కాన్ మందిరంలో ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఇస్కాన్ నిర్వాహకులు తెలిపారు. 10వ తేదీ తెల్లవారుజామున 4.30 నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకోవచ్చునని సూచించారు. దర్శనానికి వచ్చే భక్తులకు వెన్న లడ్డూ, కేలండర్‌ను ఉచితంగా అందజేస్తామన్నారు.

● **క్రిష్ణాలయంలో ఉత్తర ద్వార దర్శనం**

శ్రీ క్రిష్ణాలయంలో వైకుంఠ ఏకాదశి రోజు వైకుంఠ ద్వార దర్శనం ద్వారా వేణుగోపాలస్వామిని దర్శించుకోవడానికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఛైర్మన్ చల్లా రాజగోపాల్‌యాదవ్, కార్యదర్శి గంజి ఆంజనేయులు యాదవ్ తెలిపారు. భక్తులు ఉత్తర ద్వారం ద్వారా స్వామి ఆశీస్సులు పొందాలని సూచించారు.

తిరుమలనాథస్వామి ఆలయంలో...

మైదుకూరు రూరల్,జనవరి 8(ఆంధ్రజ్యోతి) : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని యల్లంపల్లె గ్రామంలోని తిరుమలనాథస్వామి దేవాలయంలో గురువారం నుంచి వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు ప్రారంభమౌతున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు హజరత్‌రెడ్డి తెలిపా రు. గురువారం వంద కలశాలతో అభిషేకం, గణపతి హోమం,ధ్వజరోహణ, శుక్రవారం సుప్రభాతసేవ,నారాయణ హోమం,ఉత్తర ద్వార దర్శనం ఉంటాయని తెలిపారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ,తదుపరి చక్రస్నానం కార్యక్రమాలు ఉంటాయని ప్రతి ఒక్కరూ పాల్గొనాలని తెలిపారు.

ఉపాధి కల్పన కోసం రిజిస్ట్రేషన్లు


రిజిస్ట్రేషన్‌లో పాల్గొన్న మెప్మా సిబ్బంది

మైదుకూరు రూరల్,జనవరి 8(ఆంధ్రజ్యోతి) : మైదుకూరు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో బుధవారం ఉపాధి కల్పన కోసం నిరుద్యోగ యువత అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రొద్దుటూరులో రోడ్డులోని మెప్మా ఆఫీసులో జరిగింది.ఈ కార్యక్రమంలో పట్టణ పరిధిలోని బ్యూటీషియన్స్,పెయింటర్స్,కార్పెంటర్, ప్లంబర్,ఏసీ, వాషింగ్ మెషన్, ఫ్రిజ్‌ల రిపేర్‌కు సంబంధించి శిక్షణకు సుమారు 70 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.ఈ కార్యక్రమంలో మెప్మా సభ్యులు కెజియా,జాస్లీన్, పుల్లయ్య, రమణమ్మ,మస్తాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

కొండాపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన 21, 31 జీవోలను ఉపసంహరించు కోవాలని కోరారు. అదేవిధంగా ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని జిల్లా యూనియన్ అధ్యక్షుడు హరి, మండల ఏఐటీయూసీ కార్యదర్శి వెంకటరమణ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎం. మనోహర్‌బాబు, అధ్యక్షుడిగా సురేష్, ప్రధానకార్యదర్శిగాబి. వెంకటరమణ,ఉపాధ్యక్షులుగా బుజ్జి, సూర్యనారాయణను ఎన్నుకున్నారు.

చెత్తను తొలగించండి

ఖాజీపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లోని గ్రామాల్లో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి గ్రామాలను శుభ్రంగా ఉండాలని ఎంపీడీవో దివిజాసంపతి అన్నారు. బుధవారం చెన్నముక్క పల్లె పంచాయతీలోని సచివాలయాన్ని సందర్శించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాగా నందిపాడు కాలనీలోని మంచినీటి ట్యాంకు వద్ద కొద్దిరోజులుగా వాల్వ్ లీకేజీ అయి నీరు వృథాగా పోతుందని గ్రామస్థులు ఎంపీడీవో దృష్టికి తేవడంతో సమస్యను పరిష్కరించారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం

బి.కోడూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం 2024 సంవత్సరంలో జరిగిన జాతీయ ఉపాధి హామీ పనులపై గత వారంరోజుల నుండి సామాజిక తనిఖీ బృందం పర్యవేక్షిస్తున్నారు. దానిపై నేడు బహిరంగ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో భాస్కర్ రావు తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులతో పాటు ఉపాధి సిబ్బంది, మేటీలు తప్పకుండా హాజరు కావాలని ఆయన తెలిపారు.

పాలిటెక్నిక్ కళాశాలలో రేపు జాబ్‌మేళా

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వెలుగు ఏపీఎం వెంకటసుబ్బమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌ఐసీ, గ్రీన్‌టెక్ ఇండస్ట్రిస్, ఆల్‌డిక్షన్ సంస్థలలో ఉద్యోగాల కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమా, బీటెక్, విద్యార్థులు జాబ్‌మేళాలో పాల్గొనాలని సూచించారు. వివరాలకు 9000201382 నంబరులో సంప్రదించాలని కోరారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలన

పోరుమామిళ్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని టేకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎన్‌సీడీ,ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసరు డాక్టర్ రమేశ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలకు, ఎంఎల్‌హెచ్‌పీలకు ప్రోగ్రాంకు సంబంధించి రివ్యూ చేశారు. ప్రతి స్కూలుకు వెళ్లి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయాలని, 18 సంవత్సరాలు పైబడ్డ వారికి నాన్ కమ్యూనికేబుల్ డిసీజ్‌పై పరీక్షలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీం నగరి కుమారి, రాము, వైద్యాధికారులు డాక్టర్ మేరి, కరిష్మా ఆరోగ్య విద్యాధికారులు సాదు వెంకటేశ్వర్లు, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

రిలేదీక్షలు జయప్రదం చేయండి

బద్వేలు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గత సమ్మెకాలపు ఒప్పందాల జీవో కోసం ఈ నెల 10న జరిగే మున్సిపల్ కార్మికుల రిలే నిరాహారదీక్షలను జయప్రదం చేయాలని యూనియన్ అధ్యక్షులు పులిశ్యాం, ప్రవీణ్ పేర్కొన్నారు. బుధవారం మాట్లాడారు. హామీలపై వెంటనే జీవోలు జారీ చేయాలని డిమాండ్ చేశారు.